Quraan Khuda Ka Kalam Hai
(Telugu)

ఖుర్‌ఆన్ దైవగ్రంథం

రచన

డా॥ ఇల్తిఫాత్ అహ్మద్ ఎం.ఎస్.సి.బి.టి. (అలీగఢ్)

అనువాదం

ముహమ్మద్ అబ్దుర్రషీద్

ముందుమాట

ఈనాడు ప్రపంచమంతా తీవ్ర కల్లోలాలకు గురయి ఉంది. వ్యక్తిలో గాని, సమాజంలోగాని, జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలలోగాని, అన్నింటిలో చెడు రాజ్యమేలుతూ దినదినాభివృద్ధి చెందుతోంది. చెడుకు, కల్లోలాలకు మూలం మానవ నిర్మిత చట్టాలు, రాజరికం, నియంత పరిపాలన, ప్రజాస్వామ్యం, కమ్యూనిజం, సోషలిజం, సెక్యులరిజం మొదలయినవి ఆ చెడుకు బాధ్యత వహించవలసి ఉంటుంది. ఇక మిగిలింది ఒకే ఒక మార్గం అది: ప్రపంచం మరొకసారి దైవ నియమావళి వైపు మరలడం. అయితే దీనికి ఒక అవరోధం ఉంది. అదేమిటంటే అనేకులు మావద్ద దైవ నియమావళి ఉంది అని ఘంటాపథంగా చెప్పడం. అందువల్ల ప్రజలందరూ కలసి ఒకే దైవనియమావళిని అనుసరించడం సాధ్యపడదు. అలా సాధ్యపడాలంటే తమ తమ నియమావళులను ప్రక్కనపెట్టి అందరూ ఒకే ఒక దైవ నియమావళికి బద్ధులు కావలసి ఉంటుంది. నేను హిందీలో వ్రాసిన పుస్తకం "ఖుర్‌ఆన్ సురక్షిత్ హై" ప్రచురింపబడింది. ఒక్క ఖుర్‌ఆన్ తప్ప ఎన్నిదైవ మార్గదర్శక గ్రంథాలయితే ఉన్నాయో వాటిలో ఏ ఒక్కటి కూడా తన నిజ స్వరూపంలో లేదు. ప్రతి గ్రంథంలోను మార్పులు చేర్పులు చేయిబడ్డాయి. ఆ గ్రంథాలలో నుండి మానవ కల్పితాలను వేరు చేయడం ఇప్పుడు అసంభవమయ్యింది. ఒక పండితునికి వేదాల గురించి, "రవ్వంత చక్కరలో కిలోల కొద్ది ఉప్పుకలపబడింద"ని చెప్పవలసి వచ్చింది. కొన్ని గ్రంథాలలో మూలభాష లేకుండాపోయి కేవలం అనువాదం మాత్రమే మిగిలి ఉంది. కాని దానిని పూర్తిగా నమ్మలేము అని నిరూపించడానికి చారిత్రికంగా చర్చించాను.

మానవ జీవితం ఎంత సమస్యల వలయంలో చిక్కుకుందంటే దాని మార్గదర్శకానికి ఒక్క గ్రంథం కాదు కదా పదుల సంఖ్యలో కూడా సరిపోవు. అందువల్లనే సర్వజ్ఞాని అయిన అల్లాహ్ మానవుల మార్గదర్శకానికి ఒకే ఒక్క గ్రంథం సరిపోయేలా అవతరింపజేసి ఆ గ్రంథాన్ని వివరించడానికి ఒక ప్రవక్తను

కూడా పంపించాడు. ఆ ప్రవక్త దానిని వివరిస్తూ ఆచరించేవారు. ఆ గ్రంథం ప్రకారమే వ్యక్తి నిర్మాణం, సమాజ సంస్కరణ, దేశ వ్యవహారాలు నడిపించ గలగాలి. ప్రజలు దైవనియమావళి ఆధారంగా మనగలిగే పరిపాలనను చూడ గలగాలి. ఆ విధంగా పరిశీలించినట్లయితే ఇతర గ్రంథాలన్నీ ప్రాక్షిప్తాలకు గురయ్యాయని తెలుస్తోంది. అంతేకాదు, గ్రంథం తీసుకువచ్చిన ప్రవక్త జీవితం కూడా కనుమరుగయిపోయింది. ప్రవక్తల జీవిత చరిత్ర కథల రూపంలో లభించినా గ్రంథం సురక్షితంగా లేకుండాపోయింది. ప్రపంచమంతా వెదికి నట్లయితే ఈనాడు ఏ గ్రంథమైనా సురక్షితంగా ఉందంటే అది కేవలం దివ్య ఖుర్‌ఆన్ మాత్రమే.

ఒకవేళ ఖుర్‌ఆన్ మావన రచన అయి సురక్షితంగా ఉన్నప్పటికీ అది మన సమస్యలను పరిష్కరించదు. ఎందుకంటే అది 14 వందల సంవత్స రాలకు పూర్వం నాటిది. ఆనాటి మనిషికంటే ఈనాటి మనిషి ఎంతో అభివృద్ధి సాధించాడుకదా! ఒకవేళ ఖుర్‌ఆన్ గనుక దైవ గ్రంథమైతే అది మనకు అవసరం. ఈ పుస్తకంలో "ఖుర్‌ఆన్ దైవగ్రంథం" అనే వాస్తవాన్ని తెలియ జేయడానికి పటిష్ఠమయిన దృష్టాంతాలు ఇస్తూ నేను చేసిన ఈ అల్ప ప్రయత్నాన్ని అల్లాహ్ స్వీకరించాలని, మానవులందరూ దివ్య ఖుర్‌ఆన్‌ను తమ జీవితానికి మార్గదర్శకంగా ఎన్నుకుని ఇహపరాల సాఫల్యం పొందాలని ప్రార్థిస్తున్నాను.

ఇల్తిఫాత్ అహ్మద్
గోండ, 16-8-1984

అనంత కరుణామయుడు, అపార దయామయుడయిన అల్లాహ్ పేరుతో

ఖుర్‌ఆన్ దైవగ్రంథం

ఖుర్‌ఆన్ అంటే

ఈ సృష్టికి ఒక కర్త ఉన్నాడు. ఆయన తన సృష్టిలోని చిన్న భాగమయిన భూమిపై మానవుడిని సృజించాడు. అతనికి అందమైన శరీరం, అత్యున్నతమైన సామర్థ్యం, మంచీ చెడుల విచక్షణా జ్ఞానం ఇచ్చి పరీక్షిస్తున్నాడు. మానవుడు జీవితంలోని కొంత భాగం ప్రపంచంలో గడిపి మిగతా భాగం మరణానంతరం పరలోకంలో గడుపనున్నాడు. మరణం జీవితాన్ని అంతంచేయదు. అది ఒక ద్వారం, మనిషి దానిగుండా తన నిజ జీవితంలోకి ప్రవేశిస్తాడు. దానినే "ఆలమే బర్జఖ్" అంటారు. ఒకరోజు ఈ సృష్టి ఛిన్నాభిన్నమైపోతుంది. దివ్యఖుర్‌ఆన్ దానిని ప్రళయం అంటోంది. ఆ రోజు మానవులందరి ఆత్మ శరీరాలలో ప్రవేశిస్తుంది. ఆ విధంగా ప్రతి వ్యక్తి సజీవుడయి అల్లాహ్ దర్బారులో హాజరవుతాడు. అక్కడ అతని ప్రాపంచిక జీవితానికిగాను లెక్క తీసుకోబడుతుంది. అతడు అల్లాహ్ ఇష్ట ప్రకారంగా జీవితం గడిపినట్లయితే అతనికి "స్వర్గం"లో చోటు లభిస్తుంది. ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా గడిపినట్లయితే "నరకం"లో పడవేయబడతాడు. అక్కడ అన్ని రకాల శిక్షలు ఉంటాయి. అయితే ఆ శిక్షల నుండి గట్టెక్కడానికి అక్కడ మరణం కూడా రాదు. అందువల్లనే మనిషి ప్రాపంచిక జీవితానికి చాలా ప్రాధాన్యత ఉంది. పరలోకంలో లభించే స్వర్గంగాని, నరకంగాని ఈ ప్రాపంచిక జీవితంతోనే ముడిపడి ఉంది. అందువల్ల మన జీవితానికి సంబంధించిన ఏ అంకం దైవానికి ఇష్టమయినదో, ఏది అయిష్టమయినదో మనకు తెలియడం చాలా అవసరం.

అల్లాహ్ మొట్టమొదట భూమిపై పంపిన జంటను హిందూ మతంలో "మను-సత్రూపా" అని పిలుస్తారు. క్రైస్తవ మతంలో వారిని "ఆదం (Adadm) -యేవ్ (Eve)" అని పిలుస్తారు. ఇస్లాంలో "ఆదం-హవ్వా" అంటారు. ఈ ప్రథమ జంట భూమిపైకి వచ్చినప్పుడు దైవాదేశాలను తీసుకు వచ్చింది. ఆ ఆదేశాలనే వారి సంతానం చాలా కాలం ఆచరించింది. కాని జరిగిందేమిటంటే వాటిని సురక్షితం చేయలేకపోయింది. ఫలితంగా దుర్మార్గులు, స్వార్థపరులు తమ సౌలభ్యం కోసం ప్రజలు అధర్మంగా ప్రయోజనం (Exploitation) పొందడానికి వాటిలోని అనేక మాటలను, ఇంకా అనేక పదాలను తొల గించారు. దైవనియమావళికి వ్యతిరేకంగా నడచుకోవడం వల్ల మానవ జీవితం గందరగోళానికి గురయ్యింది. అంతటా దౌర్జన్యం ప్రబలిపోయింది. అప్పుడు మళ్ళీ అల్లాహ్ తన అనుగ్రహంతో ఆ గ్రంథాన్నే ఇచ్చి ఒక సందేశహరుడిని పంపించాడు. కాని అది కూడా తన నిజస్వరూపంలో ఎక్కువ కాలం ఉండలేక పోయింది. ఆ విధంగా ప్రపంచం నలుమూలలా దైవం తరుపు నుండి ప్రవక్తలు దైవ హితవులు తీసుకుని వస్తూపోయారు. స్వార్థపరుడయిన మనిషి అందులో హెచ్చుతగ్గులు చేస్తూపోయాడు. చివరికి ప్రపంచం చాలా వరకు అభివృద్ధి సాధించిన తరువాత పరస్పర సంబంధాలు జరపడానికి హద్దులు లేకుండాపోయినప్పుడు, ప్రపంచ దేశాలు ఇల్లూ వాకిలిగా మారుతున్నప్పుడు దైవం తన చివరి మార్గదర్శక గ్రంథాన్ని సంపూర్ణంగా సిద్ధం చేసి అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా ప్రపంచానికి పంపించాడు. అదే ఖుర్ఆన్ గ్రంథం. వెనువెంటనే అల్లాహ్ దాని గురించి ఇలా అన్నాడు:

اِنا نحن نزّلنا الذکر و انا لهٗ لحٰفظون ۝ (الحجر آیت ۹)

"మేము ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము. స్వయంగా మేమే దానిని కనిపెట్టుకుని ఉంటాము." (అల్‌హిజ్ర్ :9)

మనిషి జీవించే ఏ రంగంలోనైనా దైవ ప్రసన్నతలో గడపడానికి ఒక గ్రంథం సరిపోదు. దాని కోసం వేలాది గ్రంథాలయిన తక్కువే. అందువల్ల

సర్వజ్ఞాని అయిన అల్లాహ్ ఏ మాత్రం వెలితి లేని ఒక జీవిత నియమావళిగా ఒకే గ్రంథాన్ని పంపాడు. ఆ గ్రంథంతోపాటు ఒక ప్రవక్తను కూడా పంపుతూ వచ్చాడు. ఆ ప్రవక్త ఆ గ్రంథం అర్థాన్ని, వ్యాఖ్యానాన్ని వివరించేవారు. ఎందు కంటే స్వార్థపరులు గ్రంథాన్ని తమ స్వార్థం కోసం కలగాపులగం చేయకుండా ఉండేందుకు. దైవ ప్రవక్త తన పూర్తిజ్ఞానంతో ఆ గ్రంథం ప్రకారం వ్యక్తి నిర్మాణం, సమసమాజ స్థాపన, అవకాశం దొరికితే దాని ప్రకారంగా ఒక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయగలగాలి. అది ప్రపంచానికే ఆదర్శం కాగలగాలి. ఆ విధంగా దైవ గ్రంథం, దైవ ప్రవక్త జీవితం సురక్షితంగా ఉండాలి. ఒక్క దైవ గ్రంథం మాత్రమే సురక్షితంగా ఉంటే సరిపోదు; రెండూ సురక్షితంగా ఉండాలి. గతించిన జాతుల గ్రంథమూ సురక్షితంగా లేదు; ప్రవక్తల జీవితం కథల రూపంలోనైనా సురక్షితంగా లేకుండాపోయింది. ఈ విధంగా చూసినట్లయితే కేవలం దివ్య ఖుర్‌ఆన్, దైవ ప్రవక్త (సం) జీవిత చరిత్రలు మాత్రమే మానవ మార్గదర్శకానికి నిలుస్తాయి.

ఖుర్‌ఆన్ ఔన్నత్యం

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఈ ఖుర్‌ఆన్‌ను ప్రజలముందు వినిపించి నప్పుడు, దాని బోధనలను వల్ల ఎవరి స్వార్థం నీరుగారి పోయిందో వారు ఇది "దైవగ్రంథం" కాదు అని అనడం ప్రారంభిం చారు. కాని వారి ఆ మాట నిలువ లేకపోయింది. మరి ఇది దైవగ్రంథం కాకపోతే ఎవరి గ్రంథం? అంతేకాదు, అది ముహమ్మద్ (స) రాసిన గ్రంథం అని చెప్ప డానికి కూడా అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. మౌలానా మౌదూది (రహ్మలై) ఆయన (స) గురించి ఇలా వ్రాస్తున్నారు:

"ముహమ్మద్ (స) జీవితం వారిముందే గడిచింది. దైవదౌత్యానికి పూర్వం ఆయన పూర్తిగా నలభై సంవత్సరాలుపాటు వారిమధ్యే గడిపారు. వారి నగరంలోనే జన్మించారు. వారి కళ్ళముందే బాల్యం గడిచింది. యుక్త

వయస్సుకు చేరుకున్నారు. నడి వయసు వచ్చింది. వారి మధ్య మసలు కోవడం, వారితో కలవడం, లావాదేవీలు జరపడం, వివాహ శుభకార్యాలలో పాలుపంచుకోవడం మొదలయిన సామాజిక వ్యవహారాలన్నీ వారితో ముడిపడి ఉన్నవే. ఆయన జీవితపు ఏ కోణం కూడా వారికి దాపరికంగా లేదు. వారికి ఇంత చేరువగా నున్న ఆయన జీవిత సాక్ష్యంకంటే ఇంకే సాక్ష్యం కావాలి? ఆయన జీవితంలో జరిగిన రెండు విషయాలు మక్కావాసులందరికీ తెలిసినవే.

1. దైవ దౌత్యం పదవి లభించడానికి నలభై సంవత్సరముల ముందు ఆయన (స) తన దైవ దౌత్యం పదవి గురించి, బోధనల గురించి తన నోటి నుండి ఎన్నడూ ప్రస్తావించలేదు. అంతకు ముందు దైవ దౌత్యం విషయంలో మక్కువ చూపినట్లుగాని, దాని గురించి సంభాషించినట్లు గాని, వాగ్వివాదం చేసిగాని, కనీసం తన ఆలోచననైనా వ్యక్తం చేసినట్లు ప్రజలు ఎరుగరు. ఖుర్ఆన్ బోధిస్తున్న విషయాలు ఒక్కటొక్కటిగా చర్చిస్తున్న విషయాలు కూడా ఆయన ఎప్పుడూ తన నాలుగు పదుల జీవితంలో స్నేహితులతోగాని, బంధువులతోగాని చెప్పలేదు. అంటే ఖుర్ఆన్ ఆయన సల్లంగారి ఆలోచనల నుండి పుట్టిన గ్రంథం కాదు. ఇది ఆకాశం నుండి అంతరంగంలోకి నాటుకు పోయిన గ్రంథం. మానవ మస్తిష్కం తన వయసులోని ఏ దశలోనైనా, ఏ సందర్భంలో నైనా, ఏ విషయాన్నయినా పెంపొందించుకుంటే, అది స్పష్ట మయిన దృష్టాంతాలతో ఎప్పుడో ఓసారి బహిర్గతం చేయకమానదు అనే విషయాన్ని పసిగట్టిన కొంతమంది తెలివిగలవారు ముహమ్మద్ ప్రవక్త (స) ఆలోచనలనుండి పుట్టిన గ్రంథమని చెప్పడం అంటే ఆయనపై అపవాదు మోపడమేనని భావించారు. అందువల్లనే వారు, ముహమ్మద్ (స) గారికి ఎవరో ఈ మాటలు నేర్పుతున్నారని అనడం ప్రారంభించారు. కాని ఇదీ నిరర్థకమే అయింది. కారణం ఒక్క మక్కా నగరమే కాదు, మొత్తం అరేబియా లోనే వేలెత్తి ఈ గ్రంథ రచయిత ఫలానా వ్యక్తి అని, అతడు దీని రచనకు

సమర్థుడని చెప్పడానికి ఒక్కడు కూడా లభించడు. అలాంటి సామర్థ్యంగల వ్యక్తి తెరమరుగున ఉండడం సంభవమా?

2. ఆయన గత జీవితంలో ఎన్నడు కూడా అబద్ధం చెప్పారనిగాని, మోసం చేశారనిగాని, కల్పించి మాట్లాడేవారనిగాని, జిత్తులమారి అనిగాని, మాయలు మంత్రాలు చేసేవారనిగాని ఎవరూ చెప్పలేరు. నలభై సంవత్సరాల ఆయన జీవితంలో ఏ చెడు గుణమయిన ఉందని చెప్పలేక పోయారు. అదే విధంగా ఎవరయితే ఆయన సల్లంతో వ్యవహారం చేశారో వారు ఆయనను సత్యవంతునిగా, మచ్చలేనివారిగా, నమ్మదగిన వారిగా అమానతు దారు డయిన మంచిమనిషిగా మాత్రమే కనుగొన్నారు. అంతెందుకు దైవ దౌత్యం లభించడానికి ఐదు సంవత్సరాల ముందు జరిగిన సంఘటన ఆయన సత్య వంతుడని నిరూపిస్తుంది. అదేమిటంటే 'కాబా' గృహం[1] పునర్నిర్మాణ సమయంలో 'హజ్రెఅస్వద్'[2] గోడలో అమర్చే విషయంలో ఖురైష్ తెగలోని విభిన్న కుటుంబాల మధ్య కత్తులు దూసుకునే వరకు వచ్చింది పరిస్థితి. అలాంటి సందర్భంలో రేపు ఉదయం మొట్ట మొదట ఏ వ్యక్తి 'కాబా' గృహంలో ప్రవేశిస్తాడో అతని తీర్పే శిరోధార్యం అని తీర్మానించబడింది. మరుసటి రోజు అందరి కంటే ముందు కాబా గృహంలో ముహమ్మద్ (స) గారు ప్రవేశించారు. ఆయనను చూడగానే అందరూ ఒక్కపెట్టున హాజల్ అమీన్, రజీన, హాజా ముహమ్మద్ "ఈయన అమానతుదారుడు ఈయనంటే మాకు ఇష్టమే, ఈయనే ముహమ్మద్" అని ఒక్క పెట్టున అరిచారు. ఈ విధంగా దైవదౌత్యం లభించకముందే అల్లాహ్ ఖురైష్ తెగ వారి సమూహం నోటితో ఆయన అమానతుదారుడు అని సాక్ష్యం పలికించాడు. జీవితంలోని ఏ చిన్న విషయంలో నైనా అబద్ధం పలకని, మోసం చేయని వ్యక్తి అకస్మా

1. కాబాగృహం అంటే ఏకేశ్వరాలయం.

2. హజ్రె అస్వద్ అంటే కాబాగృహం గోడలో అమర్చబడి ఉండే నల్లని రాయి.(అనువాదకుడు)

త్తుగా అసత్యం, మోసానికి పాల్పడి కొన్ని విషయాలు రచించి అవి దైవం రచించాడని గట్టిగా వాదిస్తున్నాడా!?

అందువల్లనే అల్లాహ్, ప్రవక్త మహనీయ (స)తో, వారు మోపే నిందలకు జవాబుగా వారితో : "అనండి, ఓ దైవ దాసులారా! కాస్త ఆలోచించి మాట్లాడండి. నేను బయటి నుండి వచ్చిన అనామకుడిని కాను, ఇంతకు ముందు నేను మీ మధ్యనే సుదీర్ఘ కాలం గడిపాను, మీరు నాగత జీవితాన్ని గురించి తెలిసి ఉండి కూడా నేను దైవ బోధనలను, ఆయన ఆజ్ఞ లేకుండా మీకు వినిపిస్తానని ఎలా అనుకుంటున్నారు?

ఎవరయితే ఇది దైవగ్రంథం కాదని, ఇది ముహమ్మద్(స) రచన అని అంటున్నారో వారికి దివ్య ఖుర్ఆన్ ఇలా సమాధానం ఇస్తోంది:

اَمْ يَقُوْلُوْنَ تَقَوَّلَهٗ ۔ بَلْ لَّا يُؤْمِنُوْنَ ۝ فَلْيَاْتُوْا بِحَدِيْثٍ مِّثْلِهٖٓ اِنْ
كَانُوْا صٰدِقِيْنَ ۝ (الطور آیت ۳۳-۳۴)

"ఈయన ఈ ఖుర్ఆన్‌ను స్వయంగా కల్పించాడని వారు అంటున్నారా? అసలు విషయం ఏమిటంటే, వారు విశ్వసించదలచుకోలేదు. ఒకవేళ వారు తమ ఈ మాటలో సత్యవంతులే అయితే, ఇలాంటి ఔన్నత్యంగల వాణినే రచించి తీసుకురావాలి." **(అత్ తూర్: 33-34)**

మౌలానా మౌదూది (రహ్మ) పై ఆయత్‌లకు వ్యాఖ్యానం వ్రాస్తూ:

"ఇది ముహమ్మద్ (స) రచన కాదు అనడమే సరిపోదు, అసలది ఏ మానవుని రచన కూడా కాదు అనేది వాస్తవం. అంతేకాదు, ఇలాంటి రచన చేయడానికి మనిషి అశక్తుడు. ఇది గనుక మానవ రచన అని మీరంటున్నారు కదా అయితే మానవుడు రచించిన దీనివంటి మరో రచన తెచ్చి చూపండి. ఈ ఛాలెంజి కేవలం ఖురైషీయులకే కాక ఈ ఆయత్‌లో ప్రపంచంలోని వ్యతిరేకులందరి కోసం చేయబడింది. ఆ తరువాత మక్కాలో మూడు సార్లు చివరి

సారి మదీనాలో రెండు సార్లు ఉంటంకించడం జరిగింది. ఖుర్‌ఆన్‌కు ప్రతికూలంగా ఏ మానవ రచనను తేవడానికి ఆనాడు ఎవరూ ముందుకు రాలేదు. ఈనాటికి ముందుకు వచ్చే ధైర్యం ఎవరూ చేయలేకపోయారు.

కొందరు ఆ ఛాలెంజీ వాస్తవాన్ని అర్థం చేసుకున్నవారు "ఒక్క ఖురానే ఏంటి ఏ ఒక వ్యక్తి రాసిన గద్యభాగం గాని, పద్యభాగం గాని, మరొక వ్యక్తి శైలిలో వ్రాయలేడు. హ్యూమర్, రూమి, షేక్స్‌ఫియర్, గోటే, గాలిబ్, ఠాగూర్, ఇక్బాల్ మొదలయినవారు ఈ విషయంలో తిరుగులేనివారు. కాని ఒకరు రాసిన విధంగా మరొకరు వ్రాయడం ఎవరితరం కాదు. అంటూ దివ్య ఖుర్‌ఆన్ ఛాలెంజి గురించి ఉదాహరణను ఇచ్చేవారు పొరపాటులో ఉన్నారు. "ఫల్‌యాతు బిహదీసిమ్ మిస్‌లిహీ" అంటే ఖుర్‌ఆన్ శైలిలో మరొక గ్రంథం వ్రాయడం. అంటే ఒకే విధమయిన శైలికాదు, దాని ఔన్నత్యం, దాని వైభవాన్ని అనుసరించి దాని వంటి గొప్పగ్రంథం తీసుకురండి. అది కూడా కేవలం అరబి భాషలోనే కాదు, ప్రపంచంలోని ఏ భాషలోనైనా సరే, దానికి ఉన్న ప్రత్యేకతల ప్రకారం ఆ మహత్యం గల ఖుర్‌ఆన్‌కు ధీటుగా నిలవగలగాలి. దాని కొన్ని ప్రత్యేకతలను క్రింద పొందుపరుస్తున్నాము. వాటి ప్రకారం పూర్వం ఒక మహత్యంగల గ్రంథమని, ఈనాటికీ అది తన మహత్యంతోనే నిలిచిఉందని గ్రహించ గలుగుతారు. (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ సంపుటి:2 పేజి 32-34)

1. ఏ భాషలో ఖుర్‌ఆన్ అవతరించిందో దాని నియమాలలో, దాని ఔన్నత్యంలో అది సంపూర్ణ ఆదర్శ గ్రంథం. ఈ గ్రంథం మొత్తంలో ఒక పదం అయినా, ఒక చుక్క అయినా దాని గొప్పదనానికి తగినట్లుగానే ఉన్నాయి. ఏ అంశం గురించి చెప్పినా అది తగిన పదాలను తగిన ధోరణిలో చెప్పింది. ఒకే అంశం ఎన్నిసార్లు చెప్పబడినా, ప్రతిసారి దాని సుబోధకం విలక్షణంగానే కనిపిస్తుంది. కాని ఏదీ పునరుక్తం అయినట్లు గోచరించదు. ఆరంభం నుండి అంతం వరకు దాని పదాలు పొదిగిన రత్నాల్లా ఉన్నాయి. భాషాప్రియులు దానిని విన్నట్లయితే తల ఆడించక మానరు. వ్యతిరేకులు, ప్రత్యర్థుల ఆత్మలు

సైతం ఉగ్రూతలూగక మానవు. 14 వందల సంవత్సరాలు గడిచినప్పటికీ అది తన భాషా పరంగా, సాహిత్య పరంగా తిరుగులేని గ్రంథం. దానికి సమానం మాట అటుంచి అరబి భాషలో ఏ గ్రంథం కూడా దాని సాహిత్య ధోరణికి చేరుకోలేక పోయింది. అంతేకాదు, అది తన భాషా సుబోధకంలో ఏ ధోరణిని ప్రారంభంలో అవలంభించిందో 14 వందల శతాబ్దాలు గడిచినప్పటికి ఆ ధోరణిని అది విడనాడలేదు. ఇంత సుదీర్ఘ కాలంలో భాషలు ఎన్నో మార్పులు చేర్పులకు గురవుతాయి. ప్రపంచంలో ఏ భాష కూడా ఇంత సుదీర్ఘ కాలంగా తన శైలిలో, తన జాతీయంలో, తన వ్యాకరణంలో, తన భాషలో, తన పదాల వాడుకలో ఒకే ధోరణిని అంటిపెట్టుకుని ఉండలేదు. కాని ఖుర్‌ఆన్ మాత్రం అరబి భాషను తన స్థానం నుండి కదలనివ్వలేదు. దాని ఒక్క పదం కూడా తొలగి పోలేదు. దాని ప్రతి జాతీయం ఈనాటికీ అరబి భాషలో వాడబడుతోంది. దాని సాహిత్య ప్రక్రియ ఈనాటికీ అరబి భాష ప్రక్రియలోనే కొనసాగుతోంది. 14 వందల సంవత్సరాలు గడిచినప్పటికీ రచనాపరంగా, ప్రసంగ రూపకంగా ఈనాటికీ ఆ భాషే శుద్ధమయినదిగా మనగలుగుతోంది. అలాంటప్పుడు ప్రపంచంలో ఏ మానవ మాత్రుడు రాసిన గ్రంథమయినా దాని ఔన్నత్యానికి ఎలా చేరుకోగలదు?

2. అది మానవుల ఆలోచనలపై, నైతిక ప్రవర్తనలపై, సంస్కృతిపై, జీవిత విధానంపై ఎంతగా ప్రభావం వేసిందో దాని ఉదాహరణ ఎక్కడా కానరాదు. ప్రారంభంలో దాని ప్రభావం ఒక జాతిని మార్చివేసింది. ఆ జాతి ప్రపంచంలోని ఒక పెద్ద భూభాగాన్నే మార్చివేసింది. ఇంత విప్లవాత్మకమైన గ్రంథంగా మరే గ్రంథం కూడా కానరాదు. ఇది కేవలం కాగితపు పేజీల పైననే వ్రాయబడిలేదు పైగా ఇది ఆచరణాపరంగా దాని ఒక్కొక్క పదం ఆలోచనలను తీర్చిదిద్ది ఒక నిరంతర సంస్కృతిని స్థాపించింది. 14వందల సంవత్సరాలుగా దాని ప్రభావం కొనసాగుతూ నలు దిశల విస్తరిస్తూ పోతోంది.

3. ఇది ఏ అంశం గురించి చర్చిస్తోందో అది విశాలమైన అంశం. అది సృష్టిలో అంతటా విస్తరించిన అంశం. అది సృష్టి వాస్తవికత గురించి దాని ప్రారంభం, దాని అంతం గురించి, దాని ఏలుబడి, దాని శాసనం గురించి చర్చిస్తుంది. అది ఈ సృష్టికికర్త, నిర్వాహకుడు, వివేకవంతుడు ఎవరో తెలియ జేస్తుంది. ఆయన గుణగణాలేమిటి? ఆయన అధికారాలేమిటి? ఏ వాస్త వాలపై ఈ వ్యవస్థ నడుస్తోంది? ఇంకా ఈ ప్రపంచంలో మానవుని స్థాన మేమిటో సరిగ్గా పరిశీలనతో చెపుతుంది. అతని సహజ స్థానం, జన్మ సామర్థ్యం ఏవయితే ఉన్నాయో వాటిని మార్చే శక్తి అతనికి లేదని నిరూ పిస్తుంది. అతని సహజస్థానం, జన్మసామర్థ్యం ప్రకారం మానవుని ఆలో చనలు ఆచరణలు ఏవో, నిజమార్గాల కు ప్రతికూలమయిన చెడుమార్గాలు ఏవో వాటి వాస్తవికతను తెలియజేస్తుంది. సన్మార్గాన్ని సన్మార్గమని దుర్మార్గాన్ని దుర్మార్గ మని, భూమి ఆకాశాలలోని ఒక్కొక్క విషయాన్ని, సృష్టి వ్యవస్థలోని ఒక్కొక్క కోణాన్ని, మానవ నైజం, అతని ఉనికి, మానవ చరిత్ర మొదలయిన వాటి గురించి అది లెక్కకుమించి దృష్టాంతాలను పేర్కొంటోంది. దాంతోపాటు మానవుడు ఆ మార్గాలను ఎలా, ఏ కారణాలవల్ల అనుసరిస్తున్నాడో చెబుతుంది. అయితే ఋజుమార్గం మాత్రం ప్రారంభం నుండి ఒక్కటే. ఎల్లప్పుడు ఒక్కటిగానే ఉంటుంది. ఆ మార్గాన్ని తెలుసుకోవడం ఎలా అనే విషయాన్ని కూడా అది విశదీకరిస్తుంది. ఇంకా ప్రతి కాలంలో దానిని ఏ విధంగా చూపుతూ వచ్చిందో చెబుతుంది. అది నిజ మార్గాన్ని సూచించి ఊరు కోదు పైగా ఆ మార్గంపై పయనించడానికి పూర్తి జీవిత సంవిధానాన్ని సమర్పి స్తోంది. దానిలో విశ్వాసనమ్మకాలు, పరిశుద్ధ నైజం, నైతిక ప్రవర్తన, ఆరాధనలు, సంస్కృతి, సామాజిక రీతులు, ఆర్థిక, రాజకీయ, న్యాయస్థానం, చట్టాలు ఇంకా మానవ జీవితానికి సంబంధించిన ప్రతి కోణాన్ని గురించి కావలసిన పటిష్టమయిన నియమాలను ఎరుకపరుస్తుంది. మంచి బాటను అనుసరిస్తే, చెడు మార్గాలపై నడిస్తే లభించే ఫలితాన్ని స్పష్టం చేస్తుంది. ప్రస్తుత ప్రపంచం అంతమయిన తరువాత మరొక లోకంలో పోవలసి ఉంది

అనే విషయాన్ని కూడా అది సవివరంగా తెలుపుతుంది. పైవాటిలోని ఒక్కొక్క అంశాన్ని గురించి అది సుదీర్ఘంగా వివరిస్తుంది. మరో ప్రపంచ చిత్రపటాన్ని కళ్ళముందు పెడుతుంది. పరలోకంలో మానవుడు మరొక జీవితాన్ని ఎలా పొందగలుగుతాడు? ఏ విధంగా ప్రాపంచిక జీవితాచారణకు లెక్క తీసుకో బడుతుంది? ఏ విషయాలు అక్కడ ప్రశ్నింపబడతాయి? వ్యతిరేకించలేని విధంగా అతని ఆచరణా పత్రం ఏ విధంగా ఇవ్వబడు తుంది. ఎంత పటిష్ట వంతమయిన సాక్షులు అక్కడ ఉంటారు? ప్రతిఫలం-శిక్ష పొందేవారు ఆ ప్రతిఫలం-శిక్ష ఎందుకు పొందుతారో, ప్రతిఫలం పొందేవారికి ఎలాంటి బహు మతులు ఇవ్వబడతాయో, శిక్ష పొందేవారు ఏఏ రూపాలలో శిక్ష పొందుతారో అనే సువిశాల అంశం ఆ గ్రంథంలో చర్చించబడింది. దాని రచయిత ఏవో కొన్ని చిన్నా-పెద్దా విషయాలను సమన్వయపరచి ఒక ఊహల భవనం నిర్మించడానికి వ్రాసిందికాదు; వాస్తవాలతో జ్ఞానాధారంగా రచించాడా రచయిత. ఆయన చూపులు అగోచర కాలాన్ని వర్ధమాన నిరంతర కాలాన్ని చూస్తున్నాయి. ఆయన వాస్తవాలన్నీ తెలిసినవాడు. సృష్టి మొత్తం ఆయన ముందు తెరచిన పుస్తకంలా ఉంది. మానవ ప్రారంభ సృజన నుండి అంతం వరకే కాదు, అంతమయిన తరువాత మరొక జీవితాన్ని కూడా ఒకేసారి చూడ గల శక్తిమంతుడాయన, మనిషికి ఆయన మార్గదర్శనం చేస్తున్నాడంటే గుడ్డిగా కాదు జ్ఞానపరంగానే చేస్తున్నాడు. ఏ వాస్తవాలనయితే జ్ఞానపరంగా చెబు తున్నాడో వాటిని, ఇంకా అనేక సంఘటనలను సంపూర్ణంగా వివరిస్తాడు. సృష్టిలోని ప్రతి శాఖ పరిశీలించదగిందిగా ఉంది. తత్వజ్ఞానము సైన్స్, చరిత్రకు సంబంధించిన అంతిమ పరిష్కారాలు కూడా గ్రంథంలో ఉన్నాయి. వాట న్నింటి మధ్య ఎంతగా సమన్వయం ఉందంటే దానివల్ల సంపూర్ణ ఆలోచనల సముదాయం నిర్మితమవుతుంది. జీవితానికి సంబంధించిన అన్ని కోణాల మార్గదర్శకం, పరిజ్ఞానం కలిగి ఉంది.

ఇంకా అది కేవలం స్వభావానుకూలం, పరిశుద్ధం కలిగి ఉండడమేగాక 14 వందల సంవత్సరాలు గడిచినప్పటికీ భూ ప్రపంచ నలుమూలలలో

అసంఖ్యాక ప్రజలు దీనిని అనుసరిస్తున్నారు. ఇది మేలయిన గ్రంథమని అనుభవ పూర్వకంగా తెలిసివచ్చింది. ఇంత వైభవోన్నత కలిగిన మానవ రచన ఏదయినా ప్రపంచంలో ఉందా? లేక భవిష్యత్తులో ఉండగలదా?

4. ఈ గ్రంథాన్ని ఒకేసారి రాసి మానవాళి కోసం పంపబడలేదు. కొన్ని హితవులతో, ఒక సంస్కరణా ఉద్యమం కోసం పంపబడింది. ఆ తరువాత 23 సంవత్సరాల కాలంలో కొనసాగిన ఉద్యమం ఏ ఏ పరిస్థితులను ఎదురు కుంటూ, ఏ ఏ మజిలీలను దాటుకుంటూ పోయిందో వాటికి అనుగుణంగా కొంత భాగమో, కొంత సుదీర్ఘ ప్రసంగమో, అది కొన్ని సంక్షిప్త పదాల రూపంలో ఆ ఉద్యమ నాయకుని నోట వెలువడుతూ పోయాయి. ఆ ఉద్యమం సంపూర్ణమయినప్పుడు విభిన్న సందర్భాలలో వెలువడిన భాగాలన్నింటిని అధ్యాయాలుగా సంకలనం చేసి ప్రపంచం ముందు పెట్టబడింది. దానినే "ఖుర్‌ఆన్" అని నామకరణం జరిగింది. అందులోని ప్రసంగాలు,పదాలు తనవి కావని, అవి అల్లాహ్ తరఫు నుండి తనపై అవతరించాయని ఆ ఉద్యమ నాయకుడు తెలియజేశాడు. ఒకవేళ ఏ వ్యక్తి అయిన ఆ గ్రంథాన్ని ఆ నాయకుడు రచించిందేనని చెప్పినట్లయితే అతడు ప్రపంచ చరిత్రలో ఈ నాయకుడికి ప్రతికూలంగా మరోనాయకుడిని నిలపవలసి ఉంటుంది. "ఆ నాయకుడు నిరంతరం స్వయంగా ఒక ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ, ఒక ప్రబోధకుడిగా, ఒక గురువుగా, ఒక బాధిత సంఘానికి నాయకుడిగా, ఒక దేశాధి నేతగా, ఒక సైన్యాధికారిగా, ఒక విజేతగా, ఒక చట్టాల రూపకర్తగా, భక్తికి మార్గదర్శిగా, విభిన్న పరిస్థితులలో, సందర్భాలలో, అనేక పాత్రలలో అనేక ఉపన్యాసాలు ఇచ్చిన వారెవరయినా ఉన్నారా? ఆ ప్రసంగాలన్నీ ఒకచోట సంకలనమై ఒక సంపూర్ణ నియమావళిగా ఎలాంటి లోపంగాని, ప్రతికూలతగాని లేకుండా ఆచరణకు యోగ్యమయినదిగా మనగలిగిందా? అందులో ప్రారంభం నుండి అంతం వరకు ఒకే భావన కేంద్ర బిందువుగా, ఒకే విధమయిన ఆలోచన పరంపర కొనసాగిందా? అది మొదటి రోజు నుండే ఏ

సందేశ ప్రక్రియను ప్రారంభించిందో చివరి రోజు వరకు ఆ ప్రక్రియ ప్రకారం గానే విశ్వాస నమ్మకాలు, ఆచరణలు కలిగి, వాటికి తగిన వ్యవస్థను నెల కొల్పుతూ పోయిందా? దాని ప్రతి విషయం మరో విషయంతో సమతుల్యం కలిగి ఉందా? దానిని పఠించే పాఠకుడు: ఉద్యమాన్ని ప్రారంభించేటప్పుడు ఆ ఉద్యమ నాయకుని ముందు ఉద్యమం ప్రారంభ దశ నుండి మొదలుకొని అంతం వరకు పూర్తి పథకం ఆయన ముందు ఉందా, మధ్య మధ్యన కలిగిన ఆలోచనను మార్చుకోవలసి వచ్చిన సందర్భం కూడా వచ్చిఉండ లేదా? అని భావించకమానడు. ఇలాంటి అత్యున్నతమయిన వ్యక్తి ఎవరయినా గతించి నట్లయితే అతనిపేరు చెప్పాలి.

5. ఏ మార్గదర్శి అయితే అలాంటి ప్రసంగాలు చేశాడో, ఏ పదాలయితే ఆయన నోటి నుండి వెలువడ్డాయో అవి ప్రజలకు వినిపించడానికి ఆయన ఏ మూలనుండో వచ్చి వినిపించి వెళ్ళిపోలేదు కదా! ఆయన ఉద్యమానికి పూర్వం కూడా ఆ సమాజంలో ఒక వ్యక్తిగా జీవితం గడిపారు. చివరి శ్వాస వరకు ఆ సమాజంతోనే ఉన్నారు. ఆయన సంభాషించే, ఉపన్యసించే తీరు అక్కడి ప్రజలకు సుపరిచితమే. హదీసులలో ఆయన చెప్పిన మాటలు ఈనాటికీ సురక్షితంగా ఉన్నాయి. తరువాతి తరంవారు ఆ నాయకుని బోధనలు ఎలా ఉండేవో వాటి ద్వారా తెలుసుకోగలుగుతారు. ఆ గ్రంథం భాష, దాని శైలి, ఆ నాయకుని భాష, దాని శైలి భిన్నత్వం కలిగి ఉన్నాయని, ఆ నాయకుని భాష మాట్లాడేవారు ఆనాడు గమనించారు, ఈనాడు అరబి భాష మాట్లాడేవారూ గమనిస్తున్నారు. ఎక్కడయిన ఆయన ప్రసంగంలో ఆ గ్రంథ వచనాలు గనక ప్రస్తావించినట్లయితే అప్పుడు రెండు భాషల వ్యత్యాసం స్పష్టంగా గోచరిస్తుంది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా విభిన్న శైలీలను అనునయిస్తూ ఆ భాషలపై పట్టు సాధించిన ఏ వ్యక్తి అయినా ప్రపంచంలో ఉన్నాడా? ఆయన మాట్లాడే శైలి భిన్నత్వం కలదనే మాట ప్రపంచానికి తెలియకుండా ఉండగలుగుతుందా? ఇది ఆలోచించాల్సిన విషయం.

తాత్కాలికంగా అలాంటి ధోరణిని అవలంభిస్తే అవలంబించవచ్చుగాక, కాని నిరంతరం 22 సంవత్సరాలు అవలం బించడం సాధ్యమా? ఒకే వ్యక్తి దైవం తరఫు నుండి వచ్చిన సందేశం స్టైల్ తన మాటతీరు వేరుగాను, స్వయంగా తానుగా సంభాషించే స్టైల్ వేరా? ఇదెలా సాధ్యం?

6. ఆ నాయకుడు ఉద్యమం కొనసాగుతున్న సందర్భలో అనేక పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ఒకప్పుడు ఆయన తన వంశం వారి ఎగతాళిని, నిందారోపణలను భరిస్తూ, కఠిన దౌర్జన్యానికి గురయితే మరొక్క ప్పుడు ఆయన అనుయాయులను ఎంతగా నిర్బంధించడం జరిగిందంటే వారు దేశం విడిచి వెళ్ళిపోవలసి వచ్చింది. ఒకప్పుడు శత్రువులు ఆయనను అంతం చేయడానికి పూనుకుంటే, మరొకప్పుడు తన జన్మస్థలం విడిచి వలస పోవలసి వచ్చింది. ఒకప్పుడు కఠిన కష్టాలను ఎదుర్కొంటూ ఆకలి దప్పులకు అలమటించవలసి వస్తే మరొక్కప్పుడు పోరాడవలసిన పరిస్థితులు ఏర్ప డ్డాయి. ఆ పోరాటాలలో జయాపజయాలు రెండింటిని చవి చూడవలసి వచ్చింది. ఒకసారి ఆయన శత్రువులను కడతేర్చడం జరిగింది. ఏ శత్రువు లయితే ఆయనపై దౌర్జన్యం చేశారో వారే ఆయన ముందు తలలు దించు కోవలసి వచ్చింది. ఆయనకు అధికారం బహు స్వల్పకాలంలో లభించింది. చరిత్రలో అలాంటి అదృష్టం చాలా తక్కువ వ్యక్తులకే లభించింది. ఇన్ని పరిస్థితులను ఎదుర్కొన్న వ్యక్తి ఆవేశం, ఉత్సాహం ఒకేలా ఉండవు. కాని ఆ నాయకుడు విభిన్న సందర్భాలలో చేసిన ప్రసంగం సందర్భానుచితంగా ఉండేది. అది మనిషి మనసులో ఉత్పన్నమయిన విషయం. అయితే అల్లాహ్ తరఫునుండి వచ్చిన సందేశం ఆయా సందర్భాలలో వినిపించినప్పుడు మాత్రం మానవ ఆవేశం, ఉత్సాహం అందులో రవ్వంతకూడా కానరాదు. ఏ ఒక్క సందర్భంలో కూడా ఏ పరిశోధకుడయినా ఫలానా చోట హావ భావాలు వ్యక్త మయినట్లుగా నిరూపించలేడు.

7. ఈ గ్రంథం పరిపూర్ణమైన విజ్ఞాన సర్వస్వం. ఆనాటి అరబ్బులు, రోమనులేగాక, ఈనాటి 20వ శతాబ్దపు గౌరవనీయులు, విద్వాంసులయిన

వారి వద్ద కూడా అలాంటి విద్యా జ్ఞానాలు లేవు. ఈనాడు పరిస్థితి ఎలా ఉందంటే, తత్వజ్ఞానం-చరిత్రల గురించిన ఏదో ఒక అంశంపై పరిశీలన చేయడానికి తన వయసంతా వినియోగించిన తరువాత ఆ అంశం గురించిన ఫలితం తెలుస్తుంది. అలాంటి వ్యక్తి దివ్య ఖుర్ఆన్‌ను పరిశీలించినప్పుడు అతనికి కావలసిన అంశం గురించి మెటిరియల్ లభిస్తుంది. ఈ దృక్పథం ఏదోఒక దాని గురించి పరిశీలనకే పరిమితమై లేదు. సృష్టికి, మానవుడికి సంబంధించిన అన్ని సమస్యలకు పరిష్కారం ఉంది. 14వందల సంవత్సరాలకు పూర్వం అరేబియాలోని ఒక వ్యక్తి విద్యా విజ్ఞానాల ప్రతిఅంశం గురించి, విశాల దృష్టి కలిగి, ప్రతి మూల సిద్ధాంతాన్ని పరిశీలించి దానికి తిరుగులేని సమాధానం ఇవ్వగలిగాడా?

అత్యుత్తమమయిన ఈ గ్రంథంలో ఎన్నో విషయాలున్నాయి. అయితే కేవలం కొన్ని విషయాల గురించి ఆలోచించినట్లయితే దాని అవతరణ కాలంలో అది ఎంత స్పష్టమయిన గ్రంథమో ఈనాటికి అంతే స్పష్టమైన, అద్భుతమైన గ్రంథం. దైవచిత్తమయితే ప్రళయం వరకు దాని స్పష్టత ప్రజలకు తెలుస్తూనే ఉంటుంది.

(తఫ్‌హీముల్ ఖుర్ఆన్:సంపుటి:5,పేజి: 175-180)

ఖుర్ఆన్ భాష : దివ్య ఖుర్ఆన్ భాషా పరంగా, సాహిత్య పరంగా అత్యున్నతమయిన ఆదర్శ గ్రంథం అని ముందే చెప్పుకున్నాం. అవి అరబీ భాషపై అసాధారణమైన ప్రభావం వేసింది. ఇక్కడ దాని గురించి వివరంగా చర్చించదలిచాము. భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉంటాయన్నది వాస్తవం. కొత్తగా రూపొందిన భాషలో, కొత్త కొత్త పదాలు, జాతీయాలు ఉత్పన్నమవుతూ ఉంటాయి. అలాగే భాషలన్నీ మార్పులు చెందుతున్నాయన్నది కూడా వాస్తవమే. సమాజంలో గొప్ప సాహితీకుడు, లేక ఒక గొప్ప రచయిత పుట్టుకువచ్చినప్పుడు అతడు భాషలో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తాడు. ఆ విధంగా భాషలు మార్పుచెంది అభివృద్ధి అవుతూ ఉంటాయి. అలా మార్పు

చెంది దాని అసలు స్వరూపం మటుమాయమై పోతుంది. ఆ విధంగా కొన్ని శతాబ్దాలు గడిచిన తరువాత ఒక భాషా తత్వవేత్త సైతం నిఘంటువు ప్రకారం, వ్యాఖ్యానం ప్రకారం మాత్రమే గత గ్రంథాలను అర్థం చేసుకోగలుగుతాడు. హర్మ్యామర్ రచించిన ఎలీడ్, తులసీదాస్ రచించిన రామాయణం, షేక్స్ ఫియర్ నాటకాలు మానవ రచనలలో గొప్పవిగా భావించబడతాయి. వాటి రచనా కాలం నుండి ఈనాటికీ అవి పఠింపబడుతున్నాయి. కాని ఆ అత్యున్నతమైన రచనలు వాటి శైలిని కాపాడుకోలేక పోయాయి. అరబి భాష దీనికి భిన్నమైనది. దివ్యఖుర్‌ఆన్ ఏ రీతినయితే ప్రతిపాదించిందో దానిని ఏ సాహితీకుడు కూడా దాటిపోలేడు. దివ్య ఖుర్‌ఆన్ ఏ శైలిలోనయితే అవతరించిందో ఆ శైలిని ఈనాటికీ అది కాపాడుకుంది. పద్నాలుగువందల యాభై సంవత్సరాలకు పూర్వం మక్కా నగరంలో మాట్లాడుతూ అర్థం చేసుకున్న అరబి భాష నేటికీ అలాగే ఉంది.

విద్యాజ్ఞానాల పరంగా, రాజకీయ పరంగా వచ్చిన విప్లవాల వల్ల భాషలో మార్పులు వస్తూ ఉంటాయి. అలాంటి ఆ మజిలీలన్నింటిని అరబీ భాష కూడా దాటింది. ఇస్లామీయ పరిపాలన అంతటా విస్తరించిన తరువాత అరబి భాష ఒక దేశానికే చెందిన భాషగా ఉండలేదు. పైగా అది అనేక దేశాల, జాతుల భాషగా మారిపోయింది. ఆసియా, ఆఫ్రికా దేశాల అల్ప సంఖ్యాక జాతులు ఇస్లాం స్వీకరించిన తరువాత క్రమ క్రమంగా వారి భాష కూడా అరబి భాషే అయింది. అరబ్బులు మాట్లాడే సామర్థ్యం ఆయా అరబ్బేతర దేశాల వారికి లేదనేది సహజమే. వారి భాషలో అరబ్బేతర భాషల ప్రభావం వల్ల అనేక లోపాలు జనించాయి. స్వయంగా అరబ్బులలో చైతన్య హీనులయిన వారు ఇతరుల ప్రభావానికి ఆకర్షితులయిన కారణంగా వారి భాష కూడా ప్రాక్షిప్తాలకు గురవడం ప్రారంభమయింది. ఇతర చారిత్రక భాషలలో వచ్చిన మార్పుల లాగానే అరబి భాషకూడా మార్పుకు గురయ్యింది. కాని దివ్య ఖుర్‌ఆన్ సాహిత్య భాషా ఔన్నత్యం, అరబీ భాషకు ఢాలుగా ఉపయోగపడింది. ఆ

విధంగా ఏ భాషా సిద్ధాంతం రూపొన్నయితే ఖుర్‌ఆన్ అనునయించిందో దానిని అది కాపాడుకుంది.

పాలనాధికారులు అరబ్బు జాతిని, భాషను, సాహిత్యాన్ని కాపాడడంలో జాగ్రత్త వహించారు. వారి సైన్యం, కార్యాలయ సిబ్బంది. అధికారులందరూ అరబ్బులే. కాని అబ్బాసీ పరిపాలనా కాలంలో ఈరానీయుల ఆక్రమణ జరిగి నప్పుడు అబ్బాసీలు అరబ్బు సంస్కృతిని అసహ్యించుకునేవారు. దానిని బలహీనపరచడానికి ఉపాయాలు పన్నేవారు. ఈరానీయులు, టర్కీలు, రోమీయులు, కల్లోలకారులు అటు ప్రభుత్వంలో, ఇటు సమాజంలోని వ్యవహారాలన్నింటిలో విస్తరించారు. అరబ్బులలో, అరబ్బేతరులలో వియ్యాలు అందుకోవడం ప్రారంభమయింది. అయినా ఆ యుద్ధ ప్రాతిపదిక పరిస్థితులు, విప్లవాత్మకమయిన మార్పుల వల్ల అరబి భాషలో ఎలాంటి మార్పు సంభవించలేదు.

హలాఖుఖాన్ బాగ్దాద్ ప్రభుత్వాన్ని సర్వనాశనం చేశాడు. ఉందులస్ అరేబియా ప్రభుత్వాన్ని ఐరోపా జాతులు అంతమొందించాయి. ఈజిప్ట్, సిరియాలలో నుండి ఫాతిమీలు పాతిపెట్టబడ్డారు. అరేబియా ప్రాంతాలలోని ప్రభుత్వాలు టర్కీల అధీనంలోకి వెళ్ళిపోయాయి. ఉస్మానీ టర్కీలు అరబి, పాలనా భాషగా ఉన్నప్పటికి టర్కీ భాషను అధికార భాషగా చేశారు. అరబ్బు ప్రపంచంలో మూడు వందల యాభై సంవత్సరాలు అరబ్బేతరుల పతాకం రెపరెపలాడింది. మొఘలులు, టర్కీ, ఇరాన్ పరిపాలకులంతా అరేబియా ఛాయలను కూడా నామరూపాలేకుండా చేయాలని ప్రయత్నించి అరబి గ్రంథాలను తగులబెట్టారు. పాఠశాలలను ఛిన్నాభిన్నం చేశారు. పండితులను అవమానించారు. ఉస్మానీ పాలకులు తమ శక్తినంతటిని అరబ్బులను టర్కీలుగా మార్చే ఉద్యమానికి వినియోగించారు. బాగ్దాద్, బుఖారాలలో తాతారీలు, ఉందులస్‌లో ఐరోపాజాతులు, ఈజిప్ట్‌లో క్రైస్తవులు అరబి భాషను, దాని సాహిత్యాన్ని, సంస్కృతిని బలహీనపరిచారు. ఇవన్నీ అరబి

భాషను రూపుమాపడానికి పూనుకున్నాయి. 1882లో ఈజిప్ట్‌ను ఆంగ్లేయులు స్వాధీనపరుచుకున్నప్పుడు వారు అరబి భాషను రూపుమాపడానికి పూర్తి శక్తిని వినియోగించారు. విద్యాభ్యాసానికై ఇంగ్లీషు భాషను తప్పనిసరి చేశారు. ఫ్రాన్స్ అధీనంలో ఉన్న అరబ్ ప్రాంతాలలో ఫ్రాన్స్ భాషను బోధన భాషగా తప్పనిసరి చేశారు. ఈ పరిస్థితులలో మరొక భాష ఏదయినా సరే నామరూపాల్లేకుండా పోయేదే. అంతేకాదు అక్కడ వంద సంవత్సరాలవరకు ఇంగ్లీషు, ఫ్రాన్స్ భాషలు రాజ్యమేలి నప్పటికీ అరబి భాష మాత్రం తన నిజ స్వరూపంలో ఏ మాత్రం తేడా రాకుండా స్థిరంగా ఉండిపోయింది. అది దివి నుండి భువికి అవతరించిన అరబీ భాషగానే మిగిలిపోయింది. ఈ వాస్తవాన్ని ఇస్లాం వ్యతిరేకులు కూడా అంగీకరించారు. ఈ విషయంలో ఒక క్రైస్తవ ప్రముఖుడు జార్జి (జియాదాన్) ఇలా అన్నాడు:

"అరబి భాషా సాహిత్యంపై ఖుర్ఆన్ చెప్పలేనంత ప్రభావం వేసింది. దీని ఉదాహరణ ఏ ఇతర భాషల ధార్మిక గ్రంథాలలోను కానరాదు."

మరో కోణంనుంచి ఆలోచించినట్లయితే ఖుర్ఆన్ కంటే ముందు అరబి భాష, ఇంకితర ప్రపంచ భాషలన్నింటిలో కవిత్వానికి అత్యున్నత స్థానం ఉండేది. ప్రజలు కవిత్వంలో తమ భావాలను వ్యక్తం చేయడాన్ని గొప్పగా భావించేవారు. దివ్య ఖుర్ఆన్ ఈ ధోరణిని మార్చి గద్యాన్ని అనుస రించింది. భవిష్యత్తులో కవిత్వం తన ప్రాధాన్యతను కోల్పోతుందని దాని స్థానాన్ని గద్యం ఆక్రమిస్తుందని 7వ శతాబ్దంలో అల్లాహ్‌కు తప్ప ఇంకెవరికి తెలుసు! అది శాసన గ్రంథం అయినంత మాత్రాన అప్రభావ గ్రంథం కానేకాదు. గద్యం ఎంత ప్రభావ వంతంగా ఉంటుందో ఖుర్ఆన్ అంతకంటె చాలా ప్రభావ వంతంగా ఉంటుంది.

ఖుర్ఆన్ దైవగ్రంథం

సత్యాన్నీ-న్యాయాన్నీ అభిలషించేవారు ఖుర్ఆన్‌ను దైవ గ్రంథమని ఒప్పుకోక తప్పలేదు. ఈ విషయంలో కొన్ని సంఘటనలను ఉదహరిస్తు న్నాము.

★ అరేబియాలో ఒక ప్రముఖ కవిగాని, ఒక సాహితీకుడుగాని ఏదయినా వ్రాస్తే దానిని పట్టువస్త్రంపై, బంగారు దారంతో వ్రాసి 'కాబా' గృహం గోడకు వేలాడదీసేవారు. ఆ విధంగా ఏడుగురు కవుల కవిత్వం కాబా గోడకు తగిలించబడేది. వాటిని 'సబఅ-మొఅలఖహ్' అనేవారు. ఆ ఏడుగురిలో 'లబీద్' అరేబియాలోనే ప్రఖ్యాత కవి. అతడు తాజాగా ఒక కవిత్వం వ్రాసి కాబా గృహం గుమ్మంలో వేలాడదీశాడు. మరుసటి రోజు ఒక ముస్లిం దాని ప్రక్కనే దివ్య ఖుర్‌ఆన్‌లోని కొన్ని వాక్యాలు వ్రాసి వేలాడ గట్టాడు. ఆ తరువాతి రోజు తన కవిత్వం ప్రక్కన వేలాడుతున్న వాక్యాలపై లబీద్ చూపులు పడ్డాయి. దగ్గరికి వెళ్ళి చదివి వెంటనే "ఇది మానవ రచన కాదు" అని ఇస్లాం స్వీరించి కవిత్వం వ్రాయడం మానివేశాడు. ఒకసారి రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఏదైనా తాజా కవిత్వం వినిపించమని లబీద్‌ను కోరారు. అప్పుడు లబీద్: "అయిబఅదల్ ఖుర్‌ఆన్" "ఖుర్‌ఆన్ వచ్చిన తరువాత కూడా ఎవరయినా కవిత్వం చెప్పడానికి సాహసించగలడా" అన్నాడు. ఖుర్‌ఆన్ దైవ గ్రంథం అనడానికి ఒక ప్రముఖుని సాక్ష్యమిది.

★ విలాస్టిన్ తన గ్రంథంలో ఇలా వ్రాశాడు:

Mohammad's boast About the literary

Excellence of Quran was not unfounded.

"ముహమ్మద్ గారి ఖుర్‌ఆన్ సాహిత్య పరంగా గొప్పదని చేసిన దావా అనవసర మైనదికాదు" ఆ తరువాత ఆయన దివ్య ఖుర్‌ఆన్ అవతరించిన వంద సంవత్సరాలకు జరిగిన ఒక సంఘటనను ఇలా వివరించాడు: "ఒక ప్రాంతంలోని యువకులు దివ్య ఖుర్‌ఆన్ చదువుతూ ఇస్లాం స్వీకరించ సాగారు. మన తాత ముత్తాతల మతాన్ని విడిచి ఇస్లాం ధర్మాన్ని స్వీకరిస్తున్నారని ఆ యువకుల పట్ల వృద్ధులు విచారంలో పడిపోయారు. మన పూర్వీకుల మతాన్ని మనం కాపాడుకోవాలంటే ఏం చేయాలి అని అందరూ ఒకచోట గుమిగూడి, చివరికి ఖుర్‌ఆన్ స్థానంలో దానివంటి మరొక ఖుర్‌ఆన్ రచిం

చాలని తీర్మానించారు. అంత ప్రాముఖ్యంగల ఖుర్‌ఆన్ రచించడానికి "ఇబ్నుల్ ముఖఫ్ఫఅ" అనే ప్రముఖ సాహితీపరుడు, కవియే రచించాలని కూడా తీర్మానం జరిగింది. ఆ ప్రకారంగా ఒక ప్రతినిధి వర్గం ఇబ్నుల్ ముఖఫ్ఫఅ వద్దకు వెళ్ళి తమ పథకం గురించి వివరించింది. ఇబ్నుల్ ముఖఫ్ఫఅ కూడా తన సామర్థ్యంపై విర్రవీగేవాడు. అతడు ఈ పనికోసం రెండు షరతులు పెట్టాడు. ఒకటి, పని చాలా కఠినమయినది. దానికి గాను ఒక సంవత్సరం పడుతుంది. రెండవది ఏకాగ్రతతో దానిని నిర్వహించడానికి తనను పూర్తిగా ఆపనికై విడిచిపెట్టాలి. రెండు షరతులు కూడా అంగీకరించబడ్డాయి. జనవాసాలకు దూరంగా ఒక కుటీరంలో ఇబ్నుల్ ముఖఫ్ఫఅ తన రచనా ప్రక్రియను ప్రారంభించాడు. ఆరునెలల తరువాత ప్రతినిధి బృందం పని ఎంతవరకు వచ్చిందో చూడడానికి వచ్చింది. అప్పుడు ఇబ్నుల్ ముఖఫ్ఫఅ ఒక కాగితం ముక్కతీసుకుని ఏదో రాసి చాలాసేపు దానిని చదువుతున్నాడు ఆ తరువాత దానిని చింపి పారవేస్తున్నాడు. అలా చాలాసేపు బృందం నిలబడి తిలకించింది. లోపలికి వెళ్ళి చూస్తే కాగితాలన్నీ గుట్టలా పడి ఉన్నాయి. ఇబ్నుల్ ముఖఫ్ఫఅ పశ్చాత్తాపం చెందుతూ "ఇంతవరకు ఒక ముక్కకూడా వ్రాయలేకపోయాను" అని అన్నాడు.

భూతకాలంలోని ఇద్దరు పరాయి కవులు ఖుర్‌ఆన్ దైవగ్రంథం అని ఇచ్చిన సాక్ష్యాలివి.

సమీప కాలానికి చెందిన ఇద్దరు సాహితీపరుల సాక్ష్యం వినండి:

★ కామిల్ గీలానీ ఈజిప్ట్‌కు చెందిన ప్రఖ్యాత సాహితీకుడు. అరబి భాషా సాహిత్యంలో ఆయనకు తనదంటూ ఒక స్థానం ఉండేది. ఆయనకు అమెరికాకు చెందిన ప్రముఖ ప్రొఫెసర్ 'ఫంగల్'తో స్నేహం ఉండేది. అతడు కూడా అరబీ భాషలో ప్రవీణుడే. ఈ విషయం వల్లనే గీలానీ గారితో స్నేహం ఏర్పడింది. ఫంగల్ అరబీ భాషతోపాటు ఇంగ్లీషు, జర్మనీ, హిబ్రూ భాషలు కూడా తెలిసిన పండితుడు. ఒకసారి గీలానీగారు అమెరికా వెళ్ళి

నప్పుడు ఆయన ఇంట్లోనే బసచేశారు. ఒకరోజు ప్రొఫెసర్ గీలానీ చెవులో "ఏంటి, నీవు ఇప్పటికీ ఖుర్‌ఆన్‌ను దైవ గ్రంథంగా భావిస్తున్నావా" అంటూ గీలానీ వద్ద తన మాటకు జవాబులేదు అన్నట్లుగా నవ్వాడు. గీలానీ ఎంతో నెమ్మదితో: ఖుర్‌ఆన్ గురించి ఒక నిర్ణయానికి వచ్చేముందు మనం ఖుర్‌ఆన్ వంటి గ్రంథం రచించగలమా అని పరిశోధించాలి అని అన్నారు. అప్పుడు "నరకం సువిశాలమైనది" అనే మాటకు పదాలు వ్రాయాలని తీర్మానించుకున్నారు. ఇద్దరు సాహితీపరులు కాగితాలు, కలాలు పట్టుకుని కూర్చుని ఇరవై పదాలు వ్రాశారు. అప్పుడు ప్రొఫెసర్ "ఇక చాలు ఇంతకన్నా మంచి పదాలు ఇక వ్రాయలేము"అన్నాడు. గీలానీ గారు నాదే గెలుపు అన్న విధంగా ప్రొఫెసర్ వైపు చూశారు. "ఖుర్‌ఆన్‌లో ఇంతకన్నా మంచి పదాలు ఉన్నాయా" అని అడిగాడు. దానికి గీలానిగారు, "మనమంతా ఖుర్‌ఆన్ ముందు పిల్లలవలె కనిపిస్తున్నాముకదా!" అంటూ ఈ ఆయత్ పఠించారు:

يَوْمَ نَقُولُ لِجَهَنَّمَ هَلِ امْتَلَأْتِ وَتَقُولُ هَلْ مِن مَّزِيدٍ ۝

"ఆనాడు మేము నరకాన్ని, "నీవు నిండిపోయావా?" అని అడిగినప్పుడు అది, ఇంకేమయిన మిగిలి ఉందా" అని అంటుంది". (ఖాఫ్: 30)

ఫంగల్ నోరు తెరిచింది తెరిచినట్లుగానే ఉండిపోయింది. కాస్సేపటికి తేరుకుని "గీలానీ నీవు నన్ను సాక్షిగా వ్రాసుకో ఖుర్‌ఆన్ దైవ గ్రంథమే" అని అన్నాడు.

★ అల్లామ మష్రిఖీ గారు ఒక సంఘటనను వివరించారు. ఒక ఆదివారం రోజున ఆయన లండన్‌లో ఉండగా సన్నగా వాన చినుకులు పడుతున్నాయి. ఆ సందర్భంలో ఒక ప్రముఖ శాస్త్రవేత్త సర్‌జేమ్స్‌జాన్స్ చేతిలో బైబిల్ చంకలో ఛత్రం పట్టుకుని కాలినడకన వెళుతున్నారు. గీలానీ గారు పరుగుతో వెళ్ళి ఆయనముందు నిలుచుని సలాం చేశారు. "ఏంకావాలి" అని జేమ్స్ అడిగారు. అల్లామా అన్నారు. 'రెండు ప్రశ్నలు అడగదలిచాను: ఒకటి, వర్షం పడుతోంది అయినా ఛత్రం మీ చంకలో ఉంది; జేమ్స్ తన ఏమరు

పాటును గుర్తించుకుని చిరునవ్వు నవ్వుతూ ఛత్రం విప్పుకుని మరి 'రెండో ప్రశ్న" అడిగాడు జేమ్స్. "మీరు చర్చికి ఎందుకు వెళుతున్నారు?" అని ప్రశ్నించారు అల్లామా. దానికి జేమ్స్ కాస్సేపాగి "ఈరోజు సాయంకాలం నాలుగ్గంటలకు నాతో టీ త్రాగండి" అంటూ సుర్రున జారుకున్నాడు.

సాయంకాలం నాలుగంటలకు అల్లామా మష్రిఖీ జేమ్స్ ఇంటికి చేరుకున్నారు. మిసెస్ జేమ్స్ ఆయనను సాధారంగా ఆహ్వానించింది. టీపాయ్ వద్ద కూర్చుని ఎదురు చూస్తున్న జేమ్స్ వద్దకు అల్లామాను మిసెస్ జేమ్స్ తీసుకు వెళ్ళింది. అల్లామా కూర్చోగానే జేమ్స్ ఉపన్యాసం ప్రారంభించాడు. "నేను సృష్టిలోని సృష్టితాల గురించి ఆలోచించడం ప్రారంభించగానే నాకు ఒక విధమైన భయం కలుగుంది. అప్పుడు వెంటనే వణుకు పుడుతుంది. నేను చర్చికి వెళ్ళి తలవంచి "ఓ దైవమా! నీవు గొప్పవాడివి" అని స్తుతించగానే నాకు ప్రశాంతత చేకూరుతుంది. నేను ఎందుకు చర్చికి వెళతానో అర్థమయిందా?" అన్నాడు. అంటే ఇది అల్లామా గారి ప్రశ్నకు సమాధానమన్న మాట. ఆ తరువాత అల్లామా కూడా చాలా ఆయత్లు వినిపించారు. వాటిలో ఒక ఆయత్ ఇది:

"إنما يخشى الله من عباده العلماء"

"జ్ఞానవంతులే దైవానికి భయపడతారు".

ఈ వాక్యం వినగానే జేమ్స్ ఉలిక్కి పడ్డాడు. పదేపదే ఆ ఆయత్ను వల్లిస్తూ పోయాడు. "నేను యాభై సంవత్సరాల నుండి పరిశీలిస్తున్నాను కాని ఈ వాస్తవాన్ని గ్రహించలేకపోయాను మీరు చాలా గొప్పమాటే చెప్పారు. ఈ మాట ఖుర్ఆన్లో ఉందా? అన్నాడు. ఔను అని సమాధానం వినగానే "మష్రిఖీ! నా సాక్ష్యం వ్రాసుకో ఖుర్ఆన్ దైవ గ్రంథమే, ముహమ్మద్ గారు చదువు సంధ్యలు లేనివారు కదా! ఇంత గొప్పమాట ఆయన చెప్పలేరు. నిస్సందేహంగా ఈమాట ఆయనకు అల్లాహ్యే చెప్పాడు."

ఖుర్‌ఆన్ భవిష్యవాణి

వర్షాకాలంలో మబ్బులు దట్టంగా అలుము కున్నప్పుడు ఒక వ్యక్తి : 'రెండు గంటలలో వర్షం పడుతుంది" అని అన్నట్ల యితే, నిజంగానే వర్షం కురిసినా ఆ భవిష్య విషయానికి అంతగా ప్రాముఖ్యం ఉండదు. కాని మే నెలలో మండుటెండలో మబ్బులు లేకుండా ఆకాశం నిర్మానుష్యంగా ఉన్న ప్పుడు ఒక వ్యక్తి: 'రెండు గంటలలో వర్షం కురుస్తుందని అంటే, నిజంగా వర్షం కురిసినట్లయితే ఆ భవిష్యవిషయాన్ని నిస్సందేహంగా గౌరవించవలసిందే. దివ్య ఖుర్‌ఆన్ భవిష్యవాణి కూడా అలాంటి స్థితిగలదే. ఖుర్‌ఆన్‌లో చాలా భవిష్య విషయాలు చెప్పబడ్డాయి.

ఆ భవిష్య విషయాలు చెప్పిన సమయంలో అవి నెరవేరుతాయా అనే సందేహం ఉండేది. కాని ఈనాడు అవన్నీ నిజమయ్యాయి. అలాంటప్పుడు ఖుర్‌ఆన్ మానవ రచనకాదు, దైవ గ్రంథం అని చెప్పడానికి మనిషికి గత్యం తరం ఉండదు.

దివ్యఖుర్‌ఆన్ ఎన్నో భవిష్య విషయాలు చెప్పింది. ఇక్కడ అన్నింటిని పేర్కొనడం సాధ్యంకాదు, అందుకని ఖుర్‌ఆన్‌లోని కేవలం రెండేరెండు దృష్టాంతాలను పేర్కొంటున్నాము.

★ దివ్య ఖుర్‌ఆన్ అవతరిస్తున్న కాలంలో సౌదీ అరేబియాకు ఉత్తరాన రెండు పెద్దరాజ్యాలు ఉండేవి. ఒకటి ఈరాన్‌కాగా, రెండవది రోము దేశం. ఈనాడు అమెరికా-రష్యాలకు ఉన్న స్థానమే ఆనాడు వాటికి ఉండేది.

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు దైవదౌత్యం లభించడానికి 8 సంవత్సరాల ముందు జరిగిన సజీవ సంఘటన: రోములో తిరుగుబాటు జరిగినప్పుడు రోము చక్రవర్తి "మారిస్", అతని కుటుంబంవారు అంత మొందించబడి "ఫోకస్" (Phocas) అనే వ్యక్తి గద్దెనెక్కాడు. ఈ సంఘటన వల్ల ఈరాన్ రాజు "ఖుస్రోపర్వేజ్"కు రోము దేశంపై దండెత్తడానికి సాకు

దొరికింది. మారిస్‌ను ఖుస్రోపర్వేజ్ తన ఉపకారిగా తలిచేవాడు. ఒకప్పుడు అతని సహాయం వల్లనే ఖుస్రో పర్వేజ్‌కు ఈరాన్ పీఠం లభించింది. అతడు ఈయనను తండ్రిగా భావించేవాడు. అందువల్లనే ఖుస్రో పర్వేజ్ గద్దెను అపహరించిన ఫోకాస్ దౌర్జన్యానికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రకటించాడు. క్రీ.శ. 603లో అతడు రోము దేశంపై దండెత్తాడు. ఫోకస్ సైన్యాలను క్రమ క్రమంగా ఓడిస్తూ, ఒకవైపు "అడిసా" వరకు మరకవైపు "హలబ్" ప్రాంతం వరకు చేరుకున్నాడు. ఫోకాస్ సైన్యాలు ఎక్కడ నిలువలేకపోతున్నాయి. అప్పుడు రాజదర్బారులోని ప్రముఖులు ఫోకాస్ దేశాన్ని కాపాడలేడని భావించి ఆఫ్రీకా గవర్నర్‌ను సహాయంకోరారు. అతడు తన కుమారుడయిన హర్క్యులెస్ (heracluis)తో ఒక సముద్ర సైన్యాన్నిచ్చి కుస్తుంతునియాకు పంపించాడు. ఫలితంగా ఫోకస్ పదివిచ్యుతుడయ్యాడు. అతని స్థానంలో రోము దేశానికి హర్క్యులస్ చక్రవర్తి అయ్యాడు. అతడు అధికారంలోకి రాగానే ఫోకాస్‌ను, అతని కుటుంబాన్ని హత్య చేశాడు. ఈ సంవత్సరమే మహనీయ ముహమ్మద్ గారికి దైవదౌత్యం లభించింది.

ఫోకస్ అంతమయినాక యుద్ధం చేయడానికి ఏకారణమూ లేకుండా పోయింది. కాని ఖుస్రోపర్వేజ్ ఆ యుద్ధాన్నే క్రైస్తవుల, అగ్ని పూజారుల రంగు పులిమాడు. చాలామంది యూదులు, తిరుగుబాటు దారులయిన క్రైస్తవులు అతనికి తోడయ్యారు. ఫలితంగా ఈరాన్ సైన్యం అటు ఈజిప్ట్ సరిహద్దుల దాకా, ఇటు కుస్తుంతునియా దాకా విస్తరించింది. హర్క్యులస్ పూర్తిగా నిరాశకు లోనయి సంధికోసం పర్వేజ్ వద్దకు రాయబారిని పంపాడు అతడు దానిని అలక్ష్యంతో తిరస్కరించాడు. చివరికి హర్క్యులస్ పరాజయం పాలై దేశం విడిచి ట్యూనిస్‌కు పారిపోవడానికి నిశ్చయించుకున్నాడు. దేశమా చేజారి పోయింది. కనీసం ప్రాణాలయిన కాపాడుకోవాలి కదా అని భావించాడు. ఈ విషయంలో చరిత్రకారుడు గిబ్బన్; "పరిస్థితులు ఎంతగా చేజారిపోయా యంటే దేశంలోని ప్రజలు బ్రతికి బట్టకడుతారా? అనేది ఎవరికి నమ్మకం లేకుండా పోయింద"ని వ్రాశాడు.

ఈరానీయులు బహుదైవాలను, అగ్నిని పూజించేవారు. దేవుళ్ళు ఇద్దరని కూడా నమ్మేవారు. అటు రోము దేశస్తులేమో క్రైస్తవులు. వారిలో చెప్ప లేనన్ని చెడులు జనించాయి. బహుదైవారాధన కూడా వారిలో చేరిపోయింది. అయినా వారు దేవుడు ఒక్కడేనని విశ్వసించేవారు. అందువల్ల ముస్లిములకు సహజంగా రోమన్లంటే సానుభూతి ఉండింది. మక్కా బహు దైవారాధకులు ఈరాన్ బహుదైవారాధకుల సానుభూతి పరులయ్యారు. హర్క్యులస్, పర్వేజ్‌ల మధ్య యుద్ధం చివరిదశలో ఉన్న సందర్భంలోనే అరేబియాలో బహుదైవారాధకుల, ఏకేశ్వరోపాసకుల మధ్య ఒక చారిత్రాత్మకమయిన వివాదం చెలరేగింది . ఇక్కడ ఇరువర్గాలవారు పొరుగుదేశాలయిన ఈరాన్-రోము దేశాలపట్ల మక్కువ చూపసాగారు. అరబ్బు బహుదైవా రాధకులు ఈరాన్ బహుదైవారాధకులను, ముస్లిములు రోము దేశస్తులయిన క్రైస్తవులను బలపరచసాగారు. రోమనులు క్రమ క్రమంగా ఓటమిపాలవడం చూసి ముష్రిక్కులు సంతోషపడుతున్నారు. కారణం ఈరాన్ విజయం కళ్ళ ముందు కదలాడుతోంది. ఆ సందర్భంలో దివినుండి భువికి ఖురాన్‌వాణి ఇలా వినిపించింది.

غُلِبَتِ الرُّومُ ۝ فِى ادنَى الارضِ وَهُم من بعدِ غَلَبِهِم سَيَغلِبُونَ ۝
فِى بِضعِ سِنِينَ ـ لِلّٰهِ الامرُ مِن قَبلُ و مِن بَعدُ ـ ويومَئِذٍ يَفرَحُ
المومِنُونَ ۝ (الروم آیت ۴-۲)

"రోమన్ ప్రజలు పొరుగు భూభాగంలో పరాజితులయ్యారు; తమ ఈ పరాజయం తరువాత కొన్ని సంవత్సరాలలోనే విజేతలవుతారు. ముందయినా, తరువాతయినా అధికారంమట్టుకు అల్లాహ్‌దే. ఆ రోజున అల్లాహ్ ప్రసాదించిన విజయానికి విశ్వాసులు వేడుకలు జరుపుకుంటారు."

(అర్‌రూమ్: 2-4)

ఇందులో ఒకేసారి రెండు భవిష్య విషయాలు చెప్పబడ్డాయి. ఒకటి: రోమన్‌లు సమీప భూభాగంలో పరాజితులయ్యారు, కాని తరువాత కొన్ని

సంవత్సరాలకే విజేతలవుతారు. రెండవది: ఆ రోజున అల్లాహ్ ప్రసాదించిన విజయానికి విశ్వాసులు వేడుక జరుపుకుంటారు అనేది. చూడడానికయితే ఈ భవిష్య విషయాలు అసాధ్యమనిపిస్తున్నాయి. రోము సామ్రాజ్యం విజయం సాధించడం అనేది అసంభవం. ఎందుకంటే దేశ రక్షణ అటుంచి ప్రాణం రక్షించడమెలా అనే పరిస్థితులు నెలకొనిఉన్నాయి. ఇటు ముస్లిముల స్థితి దయనీయంగా ఉంది. ఒకరిని అగ్నిపై పరుండబెడుతుంటె మరొకరి కాళ్ళు చేతులు కట్టేసి కాలుతున్న ఇసుకపై పడేసి పైన బరువయిన బండరాయిని పెట్టడం జరుగుతోంది. మరొకరిని కాలికి త్రాడుకట్టి ఆకతాయి కుర్రాళ్ళు వీధులలో తిప్పుతున్నారు.

ఇలాంటి పరిస్థితులలో దివ్య ఖుర్ఆన్ ఆయత్‌లను విని మక్కా బహుదైవారాధకులు బాగా ఎగతాళి చేయసాగారు. అబీ ఇబ్నెహలఫ్ అనే వ్యక్తి హజ్రత్ అబూబక్ర్‌తో: "ఒక వేళ మూడు సంవత్సరాలలో రోమన్‌లు విజేత లయితే, నేను పది ఒంటెలు ఇస్తాను. లేకపోతే నీవు ఇవ్వవలసి ఉంటుంది అని బెట్టు కట్టాడు. ఈ బెట్టు గురించి దైవ ప్రవక్త సల్లం గారికి తెలిసినప్పుడు ఆయన "ఫీబుజుఇసినీన్" అనే పదాలు పలికారు. అరబి భాషలో 'బిజు' అంటే పదికంటె తక్కువ అని అర్థం. అంటే పదేళ్ళ కంటె తక్కువ కాలం అని బెట్టు కట్టండి, పది నుండి వంద ఒంటెలను పెంచండి అని చెప్పారు. అందువల్ల అబూబక్ర్ అబీతో మళ్ళీ మాట్లాడి కొత్తగా బెట్టు కట్టుకున్నారు. పదేళ్ళలోపు ఎవరిమాట తప్పుగా రుజువు అవుతుందో వారు వంద ఒంటెలు ఇచ్చుకోవాలి.

622లో హజ్రత్ ముహమ్మద్ సల్లం హిజ్రత్ చేశారు. ఆ సంవత్సరమే హర్క్యులెస్ యుద్ధ సన్నాహాలు ప్రారంభించాడు. చర్చిలను, క్రైస్తవులను రక్షించ డానికి చర్చిలలో ప్రోగయిన కానుకలను వడ్డీకి తీసుకుని క్రీ.శ. 623లో ఈరాన్ వెనుక నుండి దాడిచేశాడు. క్రీ.శ. 624లో ఇర్మియాలో ప్రవేశించి కల్లోలం సృష్టించాడు. అగ్ని పూజారులను ధీటుగా ఎదుర్కొన్నాడు. ఈ సంవ

త్వరమే బదర్ మైదానంలో బహుదైవారాధకులను ముస్లిములు చిత్తు చిత్తుగా ఓడించారు. ఇది నిర్ణయాత్మకమయిన విజయం. దివ్య ఖుర్‌ఆన్‌లోని సూరహ్ రూమ్‌లో చెప్పబడిన రెండు భవిష్య విషయాలు పది సంవత్సరాలు పూర్తికాక ముందే నిజమయ్యాయి. దీని తరువాత ఇక ఎవరికి కూడా అనుమానం శంక లేకుండా పోయాయి. ఖుర్‌ఆన్ భవిష్యవాణి నిజమయ్యింది. అరేబియా బహు దైవారాధకులలోని అత్యధికులు ముస్లిములయ్యారు. "అబీబిన్ ఖలఫ్" వారసులు అబూ బక్ర్‌కు వంద ఒంటెలు అప్పగించక తప్పలేదు. దైవ ప్రవక్త సల్లం ఆజ్ఞ మేరకు వంద ఒంటెలు దానం చేయబడ్డాయి. బెట్టు కట్టిన కాలంలో ఇంకా జూదం నిషేధం గురించి ఆజ్ఞ అవతరించలేదు. కాని ఇప్పుడు అది నిషేధమనే ఆజ్ఞ వచ్చింది. అందువల్ల బెట్టు కట్టిన ఒంటెలనయితే తీసుకోవాలి కాని వాటిని వాడకుండానే దానం చేయాలని ఆజ్ఞాపించడం జరిగింది. ఈ భవిష్యవాణి ఖుర్‌ఆన్ దైవ గ్రంథమని సాక్ష్యమిస్తోంది. అలాగే సూరహ్ సఫ్ ఆయత్ 8లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

يُرِيدُونَ لِيُطْفِئُوا نُورَ اللهِ اَفْوَاهِهِمْ وَاللهُ مُتِمُّ نُورِهٖ
وَلَوْ كَرِهَ الْكٰفِرُوْنَ ۝ (الصف آیت ۸)

"వారు అల్లాహ్ జ్యోతిని తమనోటితో ఊది ఆర్పగోరుతున్నారు. కాని అవిశ్వాసులకు ఎంత అనిష్టంగా ఉన్నాసరే అల్లాహ్ తన జ్యోతిని పూర్తిగా వ్యాపింపజేయడానికే నిర్ణయించుకున్నాడు." (అస్‌సఫ్:8)

"ఈ ఆయత్ హిజ్రీశకం 3వ సంవత్సరంలో ఉహద్ యుద్ధం తరువాత అవతరించింది. అప్పుడు ఇస్లాం మదీనా నగరం పరిధి వరకే ఉండింది. ముస్లి ముల సంఖ్య కొన్ని వేలకు మించదు. అయినా అరేబియా మొత్తం కలిసి ఇస్లాంను తుడిచివేయడానికి పూనుకుంది. ఉహద్ యుద్ధంలో ముస్లిములకు జరిగిన పరాభవం వల్ల వారిలో బలహీనత చోటుచేసుకుంది. చుట్టపక్కల

తెగలవాళ్ళు వారిపై విరుచుకుపడడానికి సిద్ధంగా ఉన్నారు. అలాంటి పరిస్థితులలో "అల్లాహ్ జ్యోతిని ఎవరు ఆర్పినా ఆరిపోయేది కాదని, పైగా అది జ్యోతిర్మయమై ప్రపంచమంతటా విస్తరిస్తుందని" చెప్పిన విషయం, అది పూర్తిగా సత్యమయిన భవిష్యవాణి అని అల్లాహ్‌కు తప్ప ఇంకెవరికి తెలుసు! మానవ దృష్టి మాత్రం మిణుకుమిణుకుమని వెలుగుతున్న ఇస్లామ్ దీపాన్ని ఆర్పివేయడానికి పెనుగాలుల తుఫానులు చెరేగుతున్నాయని మాత్రం చూడగలిగింది." (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ : సంపుటి: 5, పేజి: 477)

ఖుర్‌ఆన్ - సైన్స్

ఇది సైన్స్‌కాలం. మన యువకుడు సాహిత్య పరంగా దివ్య ఖుర్‌ఆన్ ఔన్నత్యాన్ని, దాని సత్య సంధతగల భవిష్యవాణిని విశ్వసిస్తాడు. కాని సైన్స్ భాషలో చెప్పనంతవరకు అతనికి సంతృప్తి కలుగదు. అయితే మరి ఖుర్‌ఆన్ సైన్స్ గ్రంథం కాదు కదా! భౌగోళిక శాస్త్రం కాదు కదా! దాని అంశం మానవుడు. అతని మార్గదర్శకం కోసం అల్లాహ్ ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు. అయితే మానవుని సమస్యలు మాత్రం అనేకం ఉన్నాయి. ఒక Cell నుండి Space వరకు అన్నీ అతని పరిధిలోకే వస్తాయి. మానవుడు-అతని సమస్యల గురించి చర్చించినట్లయితే సృష్టిలోని అన్నింటి గురించిన ప్రస్తావన సంబంధితంగానో, అసంబద్ధంగానో వస్తూనే ఉంటుంది. ఈ గ్రంథం సృష్టి, దానిలోని ప్రకృతి నియమాలను చెప్పిందంటే సైన్స్ గురించిన వాస్తవాలను కూడా చెప్పాలనేం లేదుగా.

అయితే, దివ్య ఖుర్‌ఆన్ సృష్టి గురించి దృష్టాంతాలను పేర్కొంటూనే అది తన అవతరణ కాలంలోని మనిషి ఆలోచనా విధానం, అతని సైంటిఫిక్ పరిశోధనలను దృష్టిలో పెట్టుకుంది. ఆనాటి ప్రజలు అర్థం చేసుకోలేని విష యాలను అది చెప్పలేదు. అదే విధంగా ఖుర్‌ఆన్‌ను మేము అంతరిక్షం, భౌతిక శాస్త్రం మొదలయిన సిద్ధాంతాల వరకే పరిమితం చేయకుండా మానవ సిద్ధాంతం ప్రకారంగా ఖుర్‌ఆన్‌ను రూఢీ పరచదలిచాము. ఎందుకంటే ఖుర్‌ఆన్ స్వయంగా ఒక వాస్తవమయిన గ్రంథం కాబట్టి. ఖుర్‌ఆన్ గనుక దైవ గ్రంథమయితే అందులో వాస్తవాల Factsకు వ్యతిరేకంగా సైన్స్ కనిపెట్టిన దానికి ప్రతికూలంగా ఏమాటా ఉండకూడదు.

స్త్రీ నోటిలో పురుషునికంటె తక్కువ దంతాలు ఉంటాయని, "అరస్తు" అన్నాడు. కాని జంతుశాస్త్రం (Zoology) మాత్రం దానిని తప్పు అని నిర్ధా

రించింది. అంతేకాదు పురుషుని నోటిలో ఎన్ని దంతాలు ఉంటాయో అన్నే స్త్రీనోటిలో ఉంటాయని నిరూపించింది. అరస్తును అభిమానించేవారు: "అరస్తు డెంటిస్ట్ కాదుకదా" అన్నారు. ఇది వాస్తవం కూడాను. దంతాల విషయంలో అరస్తు మాట అసత్యమయినప్పటికీ అతని వ్యక్తిత్వానికి ఎలాంటి మచ్చారాలేదు. ఒకవేళ ఖుర్ఆన్ గనుక సైన్స్‌కు సంబంధించిన విషయం ప్రస్తావిస్తే అల్లాహ్ సైంటిస్ట్‌కాడుకదా అని అనలేముకదా! ఎందు కంటే విజ్ఞాన సర్వస్వమంతా ఉన్నది అల్లాహ్ వద్దనే కదా! ఇది నిజం కూడా. ఎందుకంటే సైన్స్ ఈనాటి వరకు ఆవిష్కరించిన వాటి నన్నింటిని ఖుర్ఆన్ ధృవీకరిస్తోంది. మనం కొన్ని ఆవిష్కరణలను గురించి చెప్పుకుందాం. అవి శతాబ్దాలుగా పరిశోధనలుచేసి కనిపెట్టబడ్డాయి. కాని పద్నాలుగు వందల యాభై సంవత్సరాలకు పూర్వమే ఖుర్ఆన్ వాటి గురించి చెప్పింది. సైన్స్ ఆనాడు బాల్య దశలో తప్పటడుగువేస్తోంది. ఆనాటి పరిశోధన ప్రకారం భూమి చతురాకారంలో ఉందని, అది ఆవు కొమ్ములపై నిలిచి ఉందని, ఆవు కదిలినప్పుడు భూకంపం వస్తుందనేవారు. భూమి కదలకుండా ఉందని, సూర్యుడు దాని చుట్టు తిరుగుతున్నాడని కూడా తేల్చారు. ఇలాంటి మాటలు విన్న ఈనాటి సైంటిస్ట్ నవ్వకమానడు. ఖుర్ఆన్ అలాంటి హాస్యా స్పదమయిన మాటలు చెప్పదు. పైగా అందులో వాటి వాస్తవాల గురించి స్పష్టమయిన విషయాలున్నాయి ఈనాటి సైన్స్ వాటిని చేరుకోడానికి వేలాది పరిశోధనలు చేయాల్సి వచ్చింది. దీనివల్ల తెలిసిందేమంటే ఖుర్ఆన్ మానవ రచనకాదు, దైవ గ్రంథం. అని ఈ విషయాలకు సంబంధించిన కొన్ని ఉదాహరణలు ప్రస్తావిస్తున్నాము.

★ అది టర్కీ పరిపాలన నాటి మాట. ఒకసారి టర్కీకి చెందిన ఒక నౌక కమాండర్ ఫ్రాన్స్ సముద్రంలో నౌకను నిలిపాడు. సైన్యానికి తాగునీరు దొరకడం లేదు. కారణం ఫ్రాన్స్ సముద్రపు నీరు ఉప్పునీరు. చుట్టూ ఎడారి ప్రాంతం. అనుకోకుండా ఆ సముద్రంలో ఒకచోట మంచినీరు గల చెలమ లభించింది. ఆ మంచినీటి చెలమ చుట్టూ ఉప్పునీరు ఉన్నాయి. అయినా

మంచి నీటిలో ఏమాత్రం మార్పురాలేదు. సైన్యం అక్కడ ఉన్నన్ని రోజులు తన అవసరాలను ఆ మంచినీటి ఖజానా నుండే తీర్చుకుంది. అమెరికన్ కంపెనీకి చెందిన నౌక నూనె అన్వేషణలో అక్కడకు చేరుకుంది. ఆ నౌకలోని వారికి కూడా తాగునీటి ఇబ్బంది ఏర్పడింది. అప్పుడు మంచినీరున్న ఖజానా వద్ద నౌకను నిలిపి పంపుద్వారా మంచినీరు పైకి తీసుకున్నారు. ఇప్పుడు అక్కడ ట్యూబ్ వెల్‌లు ఏర్పడ్డాయి. ఆ విధంగా ఎడారి ప్రాంతంలో మంచినీరు లభించాయి. టర్కీ సైన్యాధికారికి ముందు ఆ విషయం ప్రపంచానికి తెలియదు. రెండు నీళ్ళు ఒకేచోట ఉన్నా అవి కలగా పులగం కాకుండా ఉన్నాయి. ప్రపంచం దానిని చూడటం ఇదే మొదటిసారి. హుగ్లీనది నీరు మంచినీరు. బెంగాల్ సముద్రం నీరు ఉప్పునీరు. సముద్రపు ఆటుపోటులకు గురయినప్పుడు బెంగాల్ సముద్రపు ఉప్పునీరు హుగ్లీనది మంచినీటిపైనుండి పారేవి. కాని ఆ రెండు ఏమాత్రం కలిసేవికావు. ఈనాటి సైన్స్ విద్యార్థికి ఇది వింతయిన విషయంకాదు. కాని ఈ విషయం టర్కీ కమాండర్ కంటే ముందు ఎవరికీ తెలియదు. అయితే దివ్య ఖుర్‌ఆన్ మాత్రం 14 1/2 వందల సంవత్సరాలకు పూర్వమే దాని గురించి చెప్పింది. ఫుర్ఖాన్ సూరహ్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

وَهُوَ الَّذِي مَرَجَ الْبَحْرَيْنِ هَٰذَا عَذْبٌ فُرَاتٌ وَهَٰذَا مِلْحٌ أُجَاجٌ
وَجَعَلَ بَيْنَهُمَا بَرْزَخًا وَحِجْرًا مَّحْجُورًا (الفرقان آیت ۵۳)

"రెండు సముద్రాలనూ కలిపి ఉంచినవాడు ఆయనే. ఒకటేమో రుచికరమైనది, మధురమైనదీను. రెండోది చేదయినది, ఉప్పైనదీను. ఆ రెంటిమధ్య ఒక తెర అడ్డంగా ఉన్నది. అది వాటిని కలిసిపోకుండా ఆపి ఉంచే అవరోధం." (అల్ ఫుర్ఖాన్ : 53)

మరోచోట ఖుర్‌ఆన్ ఇదే విషయాన్ని చెప్పింది:

مَرَجَ الْبَحْرَيْنِ يَلْتَقِيَانِ ۝ بَيْنَهُمَا بَرْزَخٌ لَّا يَبْغِيَانِ (الرحمٰن آیت ۲۰)

"రెండు సముద్రాలు ఒకదానితో ఒకటి కలిసిపోయేటందుకు ఆయన వాటిని వదిలి పెట్టాడు. అయినా వాటి మధ్య ఒక తెర అడ్డంగా ఉన్నది. అవి దానిని అతిక్రమించవు." (అర్రహ్మాన్: 20)

దీని వ్యాఖ్యానం మౌలానా మౌదూదిగారు ఇలా వ్రాశారు:

"ఎక్కడయితే ఒక పెద్ద నది వచ్చి సముద్రంలో కలుస్తుందో అక్కడ ఈ స్థితి కనిపిస్తూ ఉంటుంది. అంతేకాదు సముద్రంలో విభిన్నచోట్ల మంచినీటి చెలమలు ఉన్నాయి. వాటి నీరు చేదు ఆ చేదు నీరు. సముద్రనీటిలో ఉన్నప్పటికీ మంచి నీరు తన తీపిదనాన్ని పోగొట్టుకోదు. పదహారవ శతాబ్దంలో టర్కీ దేశానికి చెందిన నౌక కమాండర్ సిద్ది అలిరయీస్ ఫ్రాన్స్ సముద్రంలో మంచినీటి స్థావరం గురించి తను వ్రాసిన "మరాతుల్ ముమాలిక్"లో ఇలా తెలిపాడు:

"ఉప్పునీటి కింద మంచినీళ్ళున్నాయి. నేను నా సైన్యం కోసం నీళ్ళు తీసుకుంటూఉండేవాడిని, ప్రారంభంలో అమెరికన్ కంపెనీ వారు సౌదీ అరేబియాలో నూనె తీయడానికి వెళ్ళినప్పుడు ఈరాన్ సముద్రంలోని మంచి నీటి చెలమల నుండి నీరు తీసుకునేవారు. ఆ తరువాత జహరాన్ అనే ప్రాంతంలో బావులు త్రవ్వి నీరు తీసుకోవడం జరిగింది.

(తఫ్హీముల్ ఖుర్ఆన్: సంపుటి: 2, పేజి: 457-458)

టర్కీ కమాండర్ వాటిని కనుగొనక ముందు ప్రపంచానికి ఆ విషయం తెలీదు. అయితే ఖుర్ఆన్ 14 1/2 వందల సంవత్సరాలకు పూర్వమే ఈ వాస్తవాలను వెల్లడి చేసిందంటే నిజంగా ఖుర్ఆన్ దైవ గ్రంథమే.

★ సూరహ్ యే నమల్‌లో అల్లాహ్ ఇలా తెలిపాడు:

وَاَلْقٰى فِى الْاَرْضِ رَوَاسِىَ اَنْ تَمِيْدَ بِكُمْ (النحل آیت ۱۵)

"భూమి మిమ్మల్ని తీసుకుని దొర్లిపోకుండా ఉండేందుకు అల్లాహ్ పర్వతాలను మేకులుగా నాటాడు" (అన్ నహ్ల్:15)

మౌలానా మౌదూది అలైరహ్మా ఈ ఆయత్‌కు ఇలా వ్యాఖ్యానం చేశారు:

"దీనివల్ల తెలిసేదేమంటే, భూమి పై భాగంలో ఉబికి వచ్చిన పర్వతాలవల్ల భూమి తిరగడం, దానివేగంలో దాని క్రమంలో సమతుల్యత ఉంది అని తెలుస్తోంది. దివ్య ఖుర్ఆన్ అనేక చోట్ల పర్వతాల ప్రయోజ నాలను స్పష్టంగా తెలియజేసింది. దానివల్ల ఇతర లాభాలన్ని అనుబంధ మైనవని భావించుకుంటాము. కదలికలే భూమిని కల్లోలానికి గురికాకుండా కాపాడి క్రమానుసారంగా (Regulate) తిప్పుతుంది.

(తఫ్హీముల్ ఖుర్ఆన్: సంపుటి: 2, పేజి: 530)

ఒక రైలు గంటకు వందమైళ్ళ వేగంతో నడుస్తోంది. ప్రయాణికుడు కుదుపులకు గురవుతుంటాడు. కాని మనమంతా కదలని ఈ భూమిపై నడుస్తున్నాము. కొంచెం కూడా కదలిక ఉన్నట్లు గోచరించడం లేదు. కాని భూమి మాత్రం గంటకు ఒక వెయ్యిమైళ్ళ వేగంతో తిరుగుతోంది. ఈనాడు మన శాస్త్రవేత్తలు భౌగోళిక శాస్త్రజ్ఞులు దాని గురించి తెలుసుకున్నారు. దానికి వారు ఇసోస్టసీ (Isostasy) అని పిలుస్తున్నారు. నిజంగా ఇది వారి గొప్ప విజయమనే చెప్పాలి. కాని 1450 సంవత్సరాలకు పూర్వం దివ్య ఖుర్ఆన్ దాని గురించి స్పష్టంగా వివరించిందంటే అది మానవ రచనకాదు; దైవ గ్రంథమే.

★ ఈ విషయంలో సూరహ్ ఖాఫ్‌లోని ఆయత్ కూడా గమనించ దగిందే.

أَفَلَمْ يَنظُرُوا إِلَى السَّمَاءِ فَوْقَهُمْ كَيْفَ بَنَيْنَاهَا وَزَيَّنَّاهَا وَمَا لَهَا مِن فُرُوجٍ ۝

(سورہ ق آیت ٦)

"సరే, అయితే వారు తమపై ఉన్న ఆకాశం వైపు ఎన్నడూ చూడలేదా? మేము దానిని ఎలా నిర్మించి, అలకరించామో? అందులో పగుళ్ళూలేవు."

(ఖాఫ్: 6)

సృష్టి గురించిన ఈ విషయాలు చెప్పినప్పుడు అప్పటి మానవునికి; మా తలపై ఒక నీలాకాశం ఉంది. అందులో నక్షత్రాలున్నాయి. అవి రాత్రిలో వెలిగింపబడి పగలు ఆర్పివేయబడతాయి అని మాత్రమే తెలుసు. అంతేకాదు, ఆనాడు విశాలమైన సృష్టి అనే భావన, ఉండేదికాదు. సృష్టి వ్యవస్థ ఇంత పటిష్టవంతంగా ఉంటుందని కూడా తెలియదు. అందులో చీలికగాని, రంధ్రం గాని, పగులుగాని ఉండదని, ఇది ఎడతెగని క్రమమని, భావించేవారు. కాని ఈనాడు మానవునికి సృష్టి ఒక అధ్యయన అంశంగా మారింది. పైన చెప్పిన ఖుర్‌ఆన్ వాక్యంలోని విషయాలన్నీ మానవుని ముందుకు వస్తున్నాయి. మౌలానా మౌదూది ఈ ఆయత్ విషయంలో ఇలా వ్రాస్తున్నారు:

"ఈ అద్భుత సువిశాలమైన సృష్టి ఎంతో కట్టుదిట్టంగా ఉంది. దాని క్రమం ఎడతెగకుండా, పటిష్టంగా ఉంది. దాని నైపుణ్యత ఎంత కట్టుదిట్టంగా ఉందంటే అందులో ఏ విధమయిన పగులు లేదు అందులోని క్రమం తప్పనిది. ఈ విషయాన్ని ఒక ఉదాహరణ ద్వారా బాగా అర్థం చేసుకోవచ్చు. ఆధునిక కాలంలో కాంతి కిరణాల పరిశోధకులు నక్షత్రా(Glaxy)ల వ్యవస్థను కనుగొన్నారు. దానిని SOURCE 3C 295 అనే పేరు పెట్టారు. దాని గురించి వారి అభిప్రాయం ఏమిటంటే వాటి తరంగాలు ఏవయితే మనదాకా చేరు తున్నాయో అవి 4 కోట్ల సంవత్సరాల క్రితం కంటె ముందు నుంచే అవి తమ ప్రయాణాన్ని ప్రారంభించి ఉంటాయి. సుదూరంతో తరంగాలు రావడం ఎలా సాధ్యమవుతుంది. భూమి నక్షత్రాల వ్యవస్థ మధ్య సృష్టి పరంపరలో ఎక్కడయినా బీటలువారి ఉండేదే. (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: సంపుటి:5, పేజి:112)

సూర యాసీన్ 40వ ఆయత్‌లో మరొక వాస్తవాన్ని గురించి ఇలా చెప్పబడింది:

وکُلٌّ فی فَلَکٍ یَسبحُونَ (یٰسین آیت ۴۰)

"అవన్నీ ఒక్కొక్క కక్ష్యలో తేలియాడుతూ ఉన్నాయి" (యాసీన్: 40)

మౌలానా మౌదూది పై ఆయత్ గురించి వివరణ వ్రాస్తూ:

'ఫలక్' పదం అరబీ భాషలో గ్రహసంచార మార్గము (Orbit) అనే అర్థంలో వాడుకలో ఉంది. దీని భావం (నభము) ఆకాశం అర్థానికి ప్రతికూల మయినది "అన్నీ ఒక్కొక్క కక్ష్యలో తేలియాడుతున్నాయి" అనేమాట నాలుగు విషయాల వాస్తవాలను తెలియజేస్తోంది.

★ ఒకటి: సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలన్నీ, గ్రహాలు, కక్ష్యలన్నీ పనిచేస్తున్నాయి.

★ రెండు: వాటిలో ప్రతిదాని పరిధి వేరుగా ఉంది.

★ మూడు: ఆకాశం నక్షత్రాలను తీసుకుని పరిభ్రమించడంలేదు నక్షత్రాలే ఆకాశంలో పరిభ్రమిస్తున్నాయి.

★ నాలుగు: ఆకాశంలో నక్షత్రాల కదలిక పారేనీటిలో వస్తువు తేలియాడి నట్లుగా తేలియాడుతున్నాయి.

(తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: సంపుటి: 11, పేజి: 261)

నక్షత్రాలు, గ్రహాలు ఆకాశంతో ముడిపడి ఉన్నాయని, ఆకాశం వాటిని తీసుకుని పరిభ్రమిస్తోందని ఆనాటి ప్రపంచం భావించేది. ఆ కాలంలోనే దివ్యఖుర్‌ఆన్ ఆకాశాల గురించి స్పష్టంగా తెలియజేసింది. అంటే దివ్య ఖుర్‌ఆన్ దైవ గ్రంథమని చెప్పడానికి ఇది గొప్ప సాక్ష్యం.

ఖుర్‌ఆన్‌లోని సూరహ్ తక్‌వీర్‌లో ఇలా ఉంది:

اذا الشمس كوّرت (التكوير آيت ۱)

"సూర్యుడు చుట్టి వేయబడినపుడు"

అజ్ఞాన కాలంలో సూర్యుడు దేవునిగా కొలవ బడేవాడు. సూర్య పూజ జరిగేది. అనేక జాతులు ఈనాటికి సూర్యుడిని దేవునిగానే పూజిస్తారు. కాని ఒక సాధారణ వ్యక్తి మాత్రం దాని ద్వార మాకు వెలుతురు, వేడిమి లభిస్తుందనే

అంటాడు. మన భూమి కోసం అది శక్తివంతమయిన పవర్‌హౌస్ వంటిది. సైన్స్ దానిని గురించిన వాస్తవాన్ని ఇలా ప్రకటించింది:

"AND EVENTUALLY THE SUN WILL BECOME A BLACK DWART A VERY CEUSE NON LUMINOUS OBJECT OF DEGERATE MATTER".

''చివరికి సూర్యుడు ఒక రోజున అస్త వ్యస్తంగా మారి చల్లని పదార్థంలా అయిపోతాడు''

The new encyclopeadia Britanica vol-17 page: 808

★ మరోచోట దివ్య ఖుర్ఆన్ ఇలా అంటోంది:

يَخْرُجُ مِنْهُمَا اللُّؤْلُؤُ وَالْمَرْجَانُ (الرحمٰن آیت ۲۲)

"రెండు సముద్రాలనుండి ముత్యాలు, పగడాలు వెలువడుతాయి."
(అర్‌రహ్మాన్ : 22)

అంటే చేదు నీళ్ళు గల సముద్రం, మంచి నీళ్ళుగల సముద్రం రెండింటి నుండి ముత్యాలు - పగడాలు వెలువడతాయని అంటోంది ఖుర్ఆన్.

ముత్యాలు-పగడాలు కేవలం ఉప్పునీటి సముద్రంలోనే లభిస్తాయని భావించేవారు ప్రజలు. దివ్య ఖుర్ఆన్ చెప్పిన ఈ విషయం గురించి ఒకా యన అభ్యంతరం చెపుతూ, ఉప్పు నీరు-మంచి నీరు రెండింటి నుండి ముత్యాలు-పగడాలు వెలువడుతాయని ఖుర్ఆన్ చెప్పడం తప్పు అన్నాడు. కాని ప్రస్తుత పరిశోధనలు ఖుర్ఆన్ మాటను ధృవీకరిస్తున్నాయి. ఉప్పు నీటి సముద్రంలో ఉన్న మంచి నీటి చెలమలలో నుండే ముత్యాలు-పగడాలు వెలువడుతాయని పరిశోధన వెల్లడించింది. ఫ్రాన్స్ ఉప్పు నీటి సముద్రంలో మంచి నీటి చెలమలున్న విషయం ఇంతకు ముందే చెప్పుకున్నాం కదా! ఫ్రాన్స్ సముద్రం ప్రాచీన కాలం నుండి ముత్యాల కోసం ప్రాచుర్యం పొంది ఉంది.

★ దివ్య ఖుర్ఆన్ మానవుడిని ఒక అత్యున్నతమయిన సృష్టి రాశిగా పేర్కొంది.

اَلَّذِی خَلَقَکَ ۔ فَسَوّٰکَ ۔ فَعَدَلَکَ (الانفطار آایت ۷)

"ఆయనే నిన్ను సృష్టించాడు, ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చి దిద్దాడు. నిన్ను తగిన రీతిలో పొందికగా రూపొందించాడు."

(అల్ఇన్ఫితార్:7)

ఈ విషయమే మరోచోట ఇలా చెప్పబడింది:

اَلَّذِی خَلَقَ فَسَوّٰی (الاعلیٰ آیت ۲)

"ఆయన విశ్వాన్ని సృష్టించాడు, సమమయిన తూకాన్ని నెలకొల్పాడు."

(అల్ఆలా: 2)

ఇంకొక చోట:

وَصَوَّرَکُم فَأحسن صُورَکُمْ (التغابن آیت ۳)

"మీకు ఒక రూపాన్ని కల్పించాడు, దానిని చాలా అందంగా రూపొందించాడు." (అత్ తగాబున్: 3)

ఈ ఆయత్‌లో మానవ సృష్టిని ఉన్నతంగా చెప్పబడింది. సైన్స్ పరిశోధనా ఫలితాలు తెలిసినాకొద్ది పైన చెప్పిన ఖుర్ఆన్ వాక్యాలు ధృవీకరించబడుతున్నాయి. అమెరికాకు చెందిన క్రెసిమారిస్ తన Man does not stand alone పుస్తకంలో ఇలా వ్రాశాడు: "ఆధునిక పరిజ్ఞానం కడుపును ఒక రసాయన కేంద్రంగా అభివర్ణించింది. ఇదొక కర్మాగారం. మానవుడు కనిపెట్టిన కర్మాగారాల కంటే ఇది అత్యధికంగా ఉత్పత్తి చేస్తుంది. ఇక్కడ గర్భం దాల్చడం, కనడం ఒక వ్యవస్థ. ఇది అన్ని వ్యవస్థల కంటే మించిన వ్యవస్థ. దీని గురించి ఈనాటి వరకు ప్రపంచానికి తెలిసేఉంది.

★ ప్రతి కంటిలో నూటముప్పయి మిలియన్ల 130,00,000 Light Recepters ఉంటాయి. ఇది వేలాది ముఖాల సామూహిక చిత్రాన్ని మెదడుకు పంపుతాయి.

★ నాలుకలో రుచి గురించిన 30వేల బడ్స్‌లు(TasteBuds) ఉంటాయి. ప్రతిబడ్ తన నరంద్వారా మెదడుతో అనుసంధానం కలిగి ఉంటుంది. దాని వల్లనే పదార్థాల రుచులు తెలుస్తుంటాయి. అధ్యాపకుడు షేక్ తన్ తావి జోహరి తన "తఫ్సీరుల్ జవాహర్"లో మనిషి పుట్టుక గురించి ఇలా వ్రాస్తున్నారు: మనిషి పొట్టివాడుగానో, పొడుగ్గానో, మధ్యస్థంగానో ఉంటాడు. అయితే ప్రతి ఒక్కని శరీరం ఒక పొంకముకలిగి ఉంటుంది. అందులో ఎప్పుడు కూడా ఎలాంటి భేధం కలుగదు.

★ ప్రతి మనిషి ఎత్తు అతని జానెడుతో 8 జానెడులు ఉంటాడు. మనిషి గనక తన రెండు చేతులను పక్షి రెక్కలవలె విప్పినట్లయితే ఆ చేతి చివరి నుండి ఈ చేతి చివరి వరకు కొలత ఎనిమిది జానెడులు ఉంటుంది.

★ ఒక వ్యక్తి గనుక తన చేతులను పైకి ఎత్తినట్లయితే చేతివేళ్ళ చివరి నుండి కాలివేళ్ళ వరకు ఉండే దూరం పదిజానెడులు.

★ ముఖం పొడవు నొసటిపై మొలిచే వెంట్రుకల నుండి గదువ వరకు 1 1/8 జానెడు ఉంటుంది.

★ కంటి వలయం 1/8 జానెడు.

★ బొటన వేలు, చిటికెన వేలు పొడవు సమానంగా ఉంటాయి.

డాక్టర్ ముస్తఫా మానవుని మెదడు (Brain) గురించి ఇలా వ్రాస్తున్నారు:

★ మెదడు ఒక గోడౌన్ (గోదాం) వంటిది. శరీరం లోని విభిన్న భాగాల నుండి వందల కోట్ల సన్నని తీగలు వెలువడుతాయి. వాటిని NERVE FIDRES అంటారు. కేవలం కళ్ళనుండి వెలవడే NERVEల సంఖ్య పది లక్షలు (10,00,000).

ఖుర్‌ఆన్ విభిన్నచోట్ల సృష్టిని ఒక సాక్ష్యంగా నిరూపిస్తోంది. ఎందుకంటే మానవులు దేవుని ఘనతను అర్థం చేసుకోగలగాలని. ఏ విధంగా మన పరిశోధన ప్రవర్తమానం చెందుతుందో అదే విధంగా సృష్టి దాని క్రమం దాని పటిష్టతలలో ఉన్న వివేకత శాస్త్రజ్ఞులను ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది.

وَالْاَرْضَ مَدَدْنٰهَا وَاَلْقَيْنَا فِيْهَا رَوَاسِيَ وَاَنْۢبَتْنَا فِيْهَا مِنْ كُلِّ شَيْءٍ مَّوْزُوْنٍ (الحجر آیت ۱۹)

"మేము భూమిని పరిచాము. అందులో కొండలను పాతాము. అందులో అన్ని రకాల చెట్లు చేమలను కచ్చితమయిన తగిన పరిమాణంలో సృష్టించాము." (అల్‌హిజ్ర్ : 19)

దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలాంటి చాలా ఆయత్‌లు ఉన్నాయి. సృష్టిలోని ప్రతిదాని సృజనలో వివేకత దాగి ఉంది. అవన్నీ మనముందుకు వస్తూ ఉన్నాయి.

మరొక (ప్రొఫెసర్) సయ్యద్ హవ్వా తను వ్రాసిన ''అల్లాహ్ జల్ల జలాలహు'' పుస్తకంలో ఇలా తెలియజేశారు:

★ ఒకవేళ భూమి పై భాగం కేవలం పదిఫీట్లు మందం కలిగి ఉన్నట్లయితే మన వాతావరణంలో ఆక్సిజన్ (O_2) ఉండకపోతే భూమిపై జంతుజాలాలు జీవించడం అసాధ్యమయ్యేది.

★ సముద్రం ఇంకా కొన్ని ఫీట్లు లోతు ఉండి ఉంటే కార్బన్‌డయాక్సైడ్ (Co_2)గా ఉండి ఆక్సిజన్ (O_2)ను పీల్చుకుంటే భూమిపై చెట్లు మొలిచేవి కావు. అవి పెరిగేవీ కావు.

★ ఒకవేళ భూమి పై భాగాన గాలి ఉండకపోతే (Metiors) సగటున ప్రతి రోజు రెండు కోట్ల మిణుగురు కాంతి మన వాతావరణంలో ప్రవేశించేది. దాని వేగం గంటకు ఆరుమైళ్ళ నుండి నలభైమైళ్ళ వరకు ఉంటుంది. అలా అయితే అది మన భూతలాన్ని నుజ్జునుజ్జు చేసివేసేది.

★ సూర్యుడు మనకు 9 కోట్ల 30 లక్షల మైళ్ళ దూరంలో ఉన్నాడు. ఈ దూరం అందులో సగం గనక ఉండిఉంటే భూమిపై పడుండే కాగితం తగలబడిపోయేంత ఉష్ణం ఉండేది. ఇక ప్రాణులు జీవించడమే కష్టమయి పోయేది. ఒకవేళ ఆ దూరం గనుక రెండింతలు ఉండిఉంటే ఎంత శీతలం ఉండేదంటే మనిషి జీవించి ఉంటాడన్న భావన కూడా ఉండేదికాదు.

★ చంద్రుడు ఇప్పుడున్న దూరం కంటె భూమికి కేవలం ఇరవై వేల మైళ్ళ దూరంలో ఉండి ఉంటే భూమి ప్రతిరోజు సముద్రంలో రెండుసార్లు మునిగి తేలేది. భూమిపై పర్వతాలు గనుక లేకపోయినట్లయితే భూమి ఎంతగా తూలిపోయేదంటే అది ఛిన్నాభిన్నమయిపోయేది. జంతువుల విషయంలో కూడా అద్భుతమయిన వాస్తవాలు ప్రపంచం ముందుకు వచ్చాయి. ఈ విషయంలో వందల పుస్తకాలు రచించబడ్డాయి. దివ్య ఖుర్‌ఆన్ తేనెటీగ గురించి సూరహ్ అన్ నహ్లాలో వివరించింది. తేనెటీగ గురించి ఓ పుస్తకమే వ్రాయవచ్చు. కానినేను ఇక్కడ దాని గురించి ఒక విషయం ప్రస్తావించదలిచాను. మన ముందు అనేక బాక్సులు పక్కపక్కనే పెట్టబడితే వాటి ఆకారం ఎలా ఉంటుంది? దానికి మెటిరియల్ కూడా తక్కువ విని యోగం అయి బాక్స్ లోపలి భాగం విశాలంగా ఉండాలి. బాక్స్ బాక్సకు మధ్య ఎక్కువ స్థలం కూడా పోకుండా ఉండాలి. మనం ఎంతో గంభీరంగా ఆలోచిస్తే గాని ఇంతదాకా ఆలోచించగలిగాము. అయితే అది షట్కోణాకారం (HEXAGON)గా తయారవుతుంది. ఆశ్చర్యకరమయిన విషయం ఏమంటే తేనెటీగ తెట్టెకూడా HEXAGON షట్కోణాకారంగానే ఉంటుంది. ఆ తేనెటీగ తెట్టెను భారత దేశంలో నిర్మించినా, అమెరికాలో నిర్మించినాసరే.

అగోచరం

అగోచరం గురించి దివ్యఖుర్‌ఆన్ ఇలా అంటోంది:

هُدًى لِلْمُتَّقِينَ ۝ الذين يومنُونَ بالغيب (البقره آيت ٢-٣)

"అల్లాహ్ భీతిగల వారికి ఈ గ్రంథం మార్గదర్శకం. వారు అగోచర విషయాలను విశ్వసిస్తారు." (అల్‌బఖర: 2-3)

కొన్ని వాస్తవాలను మానవుడు తన జ్ఞానేంద్రియం ద్వారా తెలుసుకో లేడు. అలాంటప్పుడు అగోచరమయిన ఆ వాస్తవాలను అంగీకరించవలసి ఉంటుంది. అంగీకరించనట్లయితే సత్యాన్ని తెలుసుకోలేడు.

కాని చాలామంది దానిని మతపిచ్చి అని, విశ్వాస నమ్మకమని, ఈనాడు సైన్స్ మానవ ఆలోచనల పరిధులను అధికమించిందని, సైన్స్ పరికరాల వల్ల సూక్ష్మ క్రిముల నుండి మొదలుకుని సుదూరంలో ఉన్న నక్షత్రాలను, గ్రహాలను తిలకించడంలో విజయం సాధించారని, అయితే మత విశ్వాసాలకు అవి అతీతమయినవి కాబట్టి వాటికి ఏ విలువలేదు అని అన్నారు. కాని ఈనాడు పరిస్థితి మారింది. "మనం ఎన్నింటినయితే చూడ గలుగుతున్నామో వాటికంటె ఎన్నోరెట్లు ఎక్కువ అగోచర విషయాలు ఉన్నాయి అవి సైన్స్ పరికరాలకు అందనివి; చూడలేని, వాటిని చూడడానికి ఎలాంటి ఆధారం కావాలో అది మన వద్దలేదు!? అందువల్ల శాస్త్రజ్ఞులు తమ పరిశోధన, (Observation)తో పాటు (Infernce)ను పెంచవలసి వచ్చింది. ఐన్‌స్టీన్ ఈ క్రింది సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు.

Indealing with The eternal values, The area of experiment reduced and the of contenplation enhanced.

"వస్తువుల వాస్తవాలను పరిశోధించడానికి దాని పరిధి కుంచించుకు పోతోంది. దృష్టాంతాల ద్వారా ఫలితాలు సాధించడం అధికమయింది."

సైన్స్ సృష్టిలో వేటినయితే తెలుసుకోగలిగిందో అది అద్భుతమయిన అర్థవంతమయిన సృష్టి. ఇంకా అది Explanation కోరుతోంది. కాని ఈ పరిశోధన తన ప్రాధాన్యతను బట్టి దృష్టాంతం (Contemplation) విషయం అవుతుందా లేక పరిశీలించడం అవుతుందా. ఇక ఇప్పుడు సైన్స్‌కు దృష్టాంతాల పరిశీలన గురించిన ప్రాధాన్యత, దాని వాస్తవికతను సమ్మతించవలసి వస్తోంది. న్యూటన్ కూడా "ప్రపంచ వ్యవస్థ వెనుక దైవిక శక్తి (Divine Arm) పనిచేస్తోంది అన్నాడు.

★ "రేడియం" చీకటిలో మెరుస్తుందన్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసు. సైంటిస్టులు దీని కారణం ఇలా తెలిపారు. రేడియం ఎలక్ట్రాన్స్ తెగి పోతూ ఉంటాయి. అందువల్ల అది మెరుస్తూ ఉంటుంది. కాని ఆ తరువాత అదే రేడియం ఒక సామాన్య మయిన గాజులా మారిపోయి మెరుపు తరిగిపోతుంది. అయితే ఎలక్ట్రాన్‌లు ఎందుకు తెగిపోతాయి అనేదానికి సైంటిస్ట్‌ల వద్ద ఎలాంటి సమాధానం లేదు. అనంత మయిన ఎలక్ట్రాన్‌ల నుండి ఒక ప్రత్యేక సమయంలో ఒక ప్రత్యేక మయిన ఎలక్ట్రాన్ ఎందుకు తెగిపోతుంది? ఈ ప్రశ్నలకు శాస్త్రజ్ఞుల ఊహలన్నీ తప్పని ఋజువుచేశాయి.

ఈ విషయంలో ఒక శాస్త్రజ్ఞునికి ఇలా అనవలసి వచ్చింది:

The Important is unknowable and The Knowable is Unimportant.

ఏది ప్రాధాన్యత కలిగి ఉందో దానిని పరిశోధించలేకపోతున్నాం ఏది పరిశీలిస్తున్నామో అది అప్రధానమయినది.

దైవదౌత్య సిద్ధాంతం

ఎవరి వద్దకయితే దైవదూత సందేశం తీసుకువస్తాడో ఆయననే ప్రవక్త అంటారు. అల్లాహ్ తన దాసులలో నుండి ఒక దాసుడిని ఎన్నుకుని ఆయనకు "వహి"[3]ని విని అర్థం చేసుకునే సామర్థ్యం ఇస్తాడు. కాని ఆయన పక్కనే కూర్చుని ఉన్నవారు ఆ వహీని వినలేరు. ఈ విషయం దైవదౌత్యం నమ్మడానికి విమర్శకులకు ఆటంకమయింది. దైవదూత మాటలు ప్రవక్త వింటున్నప్పుడు ఆయన ప్రక్కనున్న వారికి ఎందుకు వినిపించదు. ప్రక్కనున్న వారికి వినిపించదని అంటే అది మోసమే అని అన్నారు వారు.

---

3. "వహీ" అంటే దైవవాణి లేక దైవ సందేశం.

ఈనాడు సైన్స్ పరిశోధనలలో ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి. వాటి వల్ల వహీని అర్థం చేసుకోవడంలో ఒక సైంటిస్ట్‌కు ఆలోచించవలసిన పని ఉండదు.

ఒక ప్రత్యేకమయిన మిడత ఉంటుంది. అలాంటి మిడతల్లో మగ మిడత తన రెక్కను రాపిడి చేస్తుంది. అప్పుడు గాలిలో ఒక తరంగం జనిస్తుంది. ఇతర మిడతలు, పురుగులు దానిని పసిగట్టలేవు కాని ఆ రకమయిన ఆడ మిడత ఎక్కడ ఉన్నా దానిని పసిగట్టి ఆ మగ మిడత వద్దకు వచ్చేస్తుంది. అల్లాహ్ అలాంటి రకంగల మిడతకే ఆ సామర్థ్యం ఇచ్చాడు.

★ కుక్కకు దైవం వాసన పసిగట్టే ఒక ప్రత్యేక సామర్థ్యం ఇచ్చాడు. ఒక ప్రత్యేక మయిన కుక్క దారి వాసన పసిగట్టి వేటగాడయిన తన యజమాని వద్దకు చేరుకుంటుంది. ఈ సామర్థ్యం ఇతర కుక్కలకు ఉండదు. ప్రత్యేక కుక్కలకే శిక్షణ నిచ్చి వాటిద్వారా దొంగలను, హంతకులను పట్టుకోవడం కూడా జరుగుతుంది.

★ గారడి ఆట ఆడేవాడు ప్రజలకు పేకముక్కలు చూపిస్తాడు. ఆ ఒక్క పేక ముక్కలలో ఏదో ఒక దానిని తలచుకోండి అంటాడు. ఆ తరువాత అతడు ఒక పేకముక్క తీసి ఇదిగో నీవు తలచుకున్న పేకముక్క ఇదే అంటాడు. ఇలాంటి గారడి ఆటలు ప్రతిరోజు మనం ఎన్నో చూస్తూ ఉంటాం.

1952 డిసెంబర్ 2వ తేదీన జరిగిన సంఘటన

జర్మనీలోని బోవెర్‌పా నగరంలోని రంజనా హోటల్‌లో ఒక హిప్నాటిస్ట్ Hypnotic 'ఫ్రండ్‌మిస్టోయెల్' తన హిప్నాటిజాన్ని ప్రదర్శిస్తున్నాడు. ప్రజలకు ఒక పేక ముక్క చూపించాడు. ఏదో ఒక దానిని మీరు తలచుకోండి. పేక ముక్క ఏదో నేను చెప్పను. కాని మీరు తలచుకున్న పేకముక్క గురించి మీరు రేడియో ద్వారా వింటారు. రేడియో ఆన్ చేశారు. అప్పుడు వార్తలు

వస్తున్నాయి. ఆ వార్తలలోనే రంజనా హోటల్ ఆజ్ఞ రాణి అని వార్తల్లో విన్నారు. అక్కడ ఆ విషయం అందరికీ అర్థం అయ్యింది. కాని దేశమంతటా రంజనా హోటల్ ఆజ్ఞ రాణికి, సదరు వార్తలకు సంబంధం ఏమిటో శ్రోతలకు అర్థం కాలేదు. రేడియో స్టేషన్‌కు వివరణ కోరుతూ టెలిఫోన్లు రాసాగాయి. వెంటనే స్టేషన్ డైరక్టర్ వెళ్ళి వార్తలు చదువుతున్న వ్యక్తి త్రాగి ఉన్నాడేమోనని పరిక్ష చేయించాడు. కాని అతడు త్రాగలేదని డాక్టరు రిపోర్ట్ వచ్చింది. తరువాత తెలిసింది రంజనా హోటల్‌లో ఒక హిప్నాటిక్ Telepathy ద్వారా వార్తలు చదివే వ్యక్తి ఆలోచనలను ప్రభావితంచేసి తన ఆ మాటను పలికించాడని. ప్రభుత్వం పనిలో అంతరాయం కలిగించినందుకు అతనికి శిక్షపడింది.

ప్రదర్శన చేసే వ్యక్తికి హిప్నాటిజం ద్వారా మరో వ్యక్తిని ప్రభావితం చేసి తన మాటను పలికించే సామర్థ్యం దైవం ఇచ్చినప్పుడు ఆ దైవమే తన ఒక దాసునికి తన మాటను 'వహీ' ద్వారా చేరవేయడం అసంభవం ఎలా అవుతుంది? ఈనాడు సైన్స్, దానిని జ్ఞానానికి అతీతమయినదిగా ఎలా నిర్ణయిస్తుంది?

ఒక మిడతకు గాలిలో తరంగం వదిలి తన ఆడ మిడతకు సంకేతం ఇచ్చి పిలుచుకునే సామర్థ్యం ఇచ్చాడు ఆ దైవం. అదే ఇతర మిడత, పురుగులకు దాని వాసన కూడా తాకదు. ఒక కుక్క వాసన పసిగట్టి దొంగను పట్టిస్తుంది అదే స్థితి ఇతర కుక్కలలో ఉండదు. మరి ఆ అల్లాహ్ పక్కన కూర్చున్న వారికి వినిపించకుండ తన ఒక దాసునికి "వహీ" ద్వారా తన మాటను వినిపించడం అసాధ్యం ఎలా అవుతుంది? ఈ విషయమే నిన్నటి వరకు సైంటిస్టులు నమ్మడానికి ఆటంకమైంది. కాని ఈనాడు దానిని ఆటంకమూ అని అనలేరు.

పరలోక సిద్ధాంతం

దివ్య ఖుర్‌ఆన్‌లోని సూరహ్ ఖాఫ్‌లో ఇలా ఉంది:

فقال الكافرون هٰذا شئ عجيب ۝ ءاذا متنا وكنا ترابا
ذالك رجع بعيد ۝ (ق آيت ٢-٣)

"........ సత్య తిరస్కారులు ఇలా అనసాగారు. "మేము మరణించి మట్టిగా మారిపోయినప్పటికీ (మళ్ళీ బతికింపబడతామా?) ఇది చాలా విచిత్రంగా ఉంది. ఈ తిరుగు ప్రయాణం అనేది బుద్ధికి అందని విషయం."

(ఖాఫ్ : 2-3)

ఇస్లాం మౌలిక నియమాలలో దేవుని ఏకేశ్వరోపాసన తరువాత పరలోకాన్ని నమ్మే విషయం ఉంటుంది. కాని ఇస్లాంను వ్యతిరేకించే వారికి ఈ సిద్ధాంతమే మింగుడు పడని విషయం. మేము మరణించి నుజ్జు నుజ్జయ్యి మట్టిగా మారినప్పటికీ మేము బ్రతికింపబడి లేపబడతామా? ఇది ఎంతో ఆశ్చర్యకరమయిన విషయం. ఇది వారికి అసంభవమయిన విషయం. కాని 1450 సంవత్సరాలు గడిచినాక అసంభవమయిన ఆ విషయాన్ని ఈనాడు సైన్స్ అంగీకరించింది.

1932లో అండర్‌సన్ K. Anderson కాస్మిక్ రేస్ (Cosmic Rays) లోపల వ్యతిరేక ఎలక్ట్రాన్స్ (Anti Electrons)ను కనుగొన్నాడు. దానిపేరు పాజిట్రాన్ (Positron) అనిపెట్టాడు. ఇది ప్రప్రథమ వ్యతిరేకమయిన (Anti particle) భాగం. అది మానవ పరిశోధనలోకి వచ్చింది. ఈనాడు ఒక ఐటమ్‌లో 35 కంటె అధిక పార్టికల్‌ను కనుగొనడం జరిగింది. ఒక ఐటమ్‌కు దాని ఆంటి పార్టికల్ కూడా ఉంటుంది. ఈ విధంగా ఆంటి పార్టికల్‌ను ఆవిష్కరించిన వెంటనే శాస్త్రజ్ఞులు సహజంగానే ఆంటి పార్టికల్ (Antinucleus)వైపు పరిశోధనకై దృష్టిసారించారు. 1933లో డిరాక్ (Dirac) తన ఒక ప్రసంగంలో

ఆంటివరల్డ్ (Antiworld) గురించి ప్రస్తావించాడు. ఈ విధంగా Antimatter ఇంకా Antiworld ప్రచారంలోకి వచ్చాయి.

ఈనాడు సైన్స్ ప్రతి దానికి ఒక వ్యతిరేక (Anti) విషయాన్ని నిలుపుతుంది అనేది తిరుగలేని వాస్తవం. ప్రతిదాని ఉనికి తన వ్యతిరేకతతో ముడిపడి ఉంది. దానికి అయస్కాంతం (Magnet)ను ఉదహరించడం జరిగింది. అయస్కాంతానికి ఒక వైపు Northpole ఉంటె మరోవైపు South pole ఉంటుంది. ఒకవేళ ఒక పోల్ అంతం అయితే రెండవ పోల్ తనకుతానే అంతమయిపోతుంది. అంటే ఒక వస్తువు ఉనికిలోకి వచ్చినప్పుడు దాని వ్యతిరేకం కూడా ఉందని రుజువయ్యింది. ప్రపంచం మన ముందుంది అంటే దానికి కూడా వ్యతిరేక ప్రపంచం ఉండాల్సిందేగా. అయితే అదే పరలోకం. ఈనాటి శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం వ్యతిరేక ప్రపంచం అంటే పరలోకమే. అది మన ప్రపంచానికి సమతుల్యమైన ఉనికి కలిగి ఉంది. డాక్టర్ నాన్ (Dr. Naan) అభిప్రాయం ప్రకారం ఆంటి వరల్డ్ ఇప్పుడు ఉంది. కాని అది మనకు అతీతంగా ఉంది మన ప్రపంచానికి సమతుల్యం కలిగి ఉనికిలో ఉంది.

★ జె.యస్.హెల్డెన్ (J.S. Heldanne) ఇలా అంటున్నాడు:

"అంతమయిపోయే ఈ ప్రపంచం వెనుక మరొక ప్రపంచం ఉందని నమ్మడానికి కష్టమేమీ లేదు." (Philosphical Basis of Biology Page: 38)

మ్యాక్స్ ప్లాంక్ Maxplank తను వ్రాసిన Universe in the light of Modem physics గ్రంథంలో కనిపిస్తున్న ఈ ప్రపంచం కాక మరొక వాస్తవమయిన ప్రపంచం ఉంది. అది మానవ భావానికి అతీతంగా ఉంది.

ఎ.ఎస్. అడ్డింగ్‌టన్ (A.S. Addington) సైన్స్ అండ్ అన్‌సీన్ వరల్డ్ (Science and the Unseen world) పుస్తకంలోని 33వ పేజీలో ఇలా అభిప్రాయం వ్యక్తం చేశాడు;

"శాస్త్రజ్ఞులు పరలోకం ఉందని ఒప్పుకున్నారు. అంతేకాదు అది ఈనాడు కూడా ఉందని పూర్తిగా నమ్ముతున్నారు. అక్కడి స్థితిగతులు ఇక్కడి స్థితిగతులకు ప్రతికూలమయినవి. ఇక్కడి ప్రతివస్తువు తాత్కాలికమయినది అక్కడి వస్తువు శాశ్వతమైనది. ఇక్కడి ఏ వస్తువుకు స్థిరత్వం లేదు...... మరో ప్రపంచంలోని ప్రతి వస్తువుకు స్థిరత్వం ఉంది......... మరో ప్రపంచపు వెలుతురు మన దాకా వస్తుండవచ్చు అని సైంటిస్టుల అభిప్రాయం. రెండు వెలుగులను మనం వేరు చేయలేము. ఎందుకంటే మరో ప్రపంచం మనకు కనిపించటం లేదు కాదా! మరో ప్రపంచాన్ని తెలుసుకోడానికి న్యూట్రానో (Neutrano) సహాయం తీసుకోవచ్చు. కాని న్యూట్రానో అంటి న్యూట్రానోకు ఒక్క క్షణం కూడా స్థిరత్వం అనేది ఉండదు. అందువల్ల అది మన అధీనంలోకి రావడం కొంచెం కష్టమే. పరలోక ప్రపంచం ఇప్పుడు సిద్ధంగా ఉందా లేదా? సైంటిస్టులు మన ఈ ప్రపంచంలో పరలోక ప్రపంచాన్ని చూపిస్తారా లేదా అనేవి వేరే విషయాలు. అసంభవం అనుకున్నది ఈనాడు శాస్త్రరంగంలో సంభవమయింది కదా!

దివ్య ఖుర్‌ఆన్ బోధనలన్నీ (తౌహీద్, రిసాలత్, ఆఖిరత్) దేవుని ఏకత్వం, దైవ దౌత్యం, పరలోకం చుట్టూ తిరుగుతూ ఉంటాయి. గతంలో సైన్స్ వీటిని వ్యతిరేకించింది, కాని ఇప్పుడు శాస్త్రజ్ఞుల దృష్టికి అలాంటి విషయాలు వచ్చాయి. ఇక ఇప్పుడు సైన్స్ వీటిని నమ్మకపోవడానికి ఏ కారణమూ మిగలదు.

మానవ సమాజం

ఇక మేము మానవ సమాజం గురించి చర్చించదలిచాము. అయితే మానవ సమాజంలో స్త్రీ పురుషుల సంబంధాలు ఎలా ఉండాలనే ప్రశ్న మా ముందుంది. ఖుర్‌ఆన్ షరీఅత్ ప్రకారం స్త్రీ పురుషులు ఒకరికి మరొకరు పరిపూర్ణం చేసుకోవడం. దీనికి ప్రతికూలంగా ఆధునిక సంస్కృతిలో స్త్రీ పురు

షులు ఒకరికొకరు డూప్లికేట్ (Duplicate) అని అంటోంది. దివ్య ఖుర్ఆన్ ప్రకారం రెండు జాతుల పరిధులు వేరువేరుగా ఉన్నాయి. ఇస్లామీయ షరీఅత్ స్త్రీకి ఇంటిపరిధిని, పురుషునికి బయటి ప్రపంచాన్ని నిర్ణయించింది. అయితే ఆధునిక సంస్కృతి స్త్రీ పురుషులు ఇద్దరికి ఒకే కార్యరంగం నిర్దేశిస్తోంది. వాళ్ళిద్దరిలో ఏ విధమయిన భేదం ఉండరాదు. జీవితపు అన్ని రంగాలలో స్త్రీ పురుషులిద్దరూ భుజం భుజం కలిపి పనిచేయాలి. పందొమ్మిదవ శతాబ్దంలో పశ్చిమ దేశాలలో సమానత్వంపై స్త్రీ పురుషులకు ఒకే విధమయిన నియమాలు, అవలంభించడం జరిగింది. కాని ఆ ప్రకారంగా వందేళ్ళు గడిచినా స్త్రీ ఏ శాఖలోనైన పురుషునితో సమానంగా మనగలుగుతుందనేది సాధ్యం కాలేక పోయింది. ఈ అపజయం మళ్ళీ పునరాలోచనలో పడవేసింది. ఇరవైవ అర్ధ శతాబ్ది చివరార్ధంలో ఈ విషయం గురించి పశ్చిమ దేశాలలో ముఖ్యంగా అమెరికాలో పెద్ద పెట్టున శోధించడం జరిగింది. ఈ శోధన దివ్య ఖుర్ఆన్ సిద్ధాంతాన్ని ధృవీకరించింది. అంతేకాదు ఇద్దరిలో మానసికంగా కూడా చాలా భేదం ఉందని రుజువయ్యింది. అదేవిధంగా జీవశాస్త్ర (Biological) పరంగా ఉన్న భేదం కూడా స్పష్టమయింది. కార్యాచరణ ప్రకారం చూసినా ఇద్దరు ఒకే పనికోసం తగరు.

స్త్రీ పురుషుల భేదం ఖుర్ఆన్ సిద్ధాంతం ప్రకారం పదమూడు శతాబ్దాల వరకు సగ భూమిపై అమలు జరిగింది. వాళ్ళిద్దరికి జీవితం గడపడంలో ఎలాంటి అవరోధాలు ఏర్పడలేదు కాని పశ్చిమ దేశాలలో ఆధునిక సిద్ధాంతం స్త్రీ పురుషులతో సమానత్వం సమాజంలో చెడును జనింపజేసింది. ఆ సిద్ధాంతం, నియమాల ప్రకారం చూసినట్లయితే కుటుంబ జీవితం పూర్తిగా ఛిన్నాభిన్నమయిపోయింది.

స్త్రీకి బయటి పని అప్పగించడం వల్ల పశ్చిమంలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. పాపం పిల్లలు తమ తల్లి దండ్రుల శిక్షణకు నోచుకోలేక పోయారు. ఫలితంగా వారు మానసిక రోగానికి బలయ్యారు. దీనిని "అయ్

జమ్" అంటారు. పిల్లవాడు బలంగా కనిపించినప్పటికీ మానసిక రోగానికి గురయిపోతాడు. అంటే పిల్లవాడిలో భయం, స్నేహితులతో కొట్లాట, విద్య అభ్యసించకపోవడం, తీవ్రవాదాన్ని ఇష్టపడడం మొదలయినవి చోటు చేసు కుంటాయి. మరోవైపు స్త్రీ పురుషుల స్వేచ్ఛ కలయికల వల్ల విడాకులు అధిక మయ్యాయి. ఫలితంగా వర్ధమాన ప్రపంచం ఖుర్ఆన్ సిద్ధాంతమే సరయిన సిద్ధాంతమని ఒప్పుకోక తప్పలేదు.

చట్టం ఆవశ్యకత

మానవునికి ఏదయినా చట్టం అవసరమా కాదా? అనేది ప్రధాన మయిన ప్రశ్న. ప్రపంచంలోని మేధావులు ఈ విషయంలో అనేక కోణాల నుండి ఆలోచించడానికి ప్రయత్నించారు. పరిశోధనలు కూడా జరిగాయి. వాస్తవం ఏమంటే మనిషి ఒక Cell నుండి Space వరకు, సైకాలజి నుండి ఆర్థికం వరకు అనేక శాస్త్రాలకు కేంద్రం. మరో మాటలో చెప్పాలంటే మాన వుడిని తెలుసుకోడానికి సృష్టిని తెలుసుకునే జ్ఞానం కూడా అవసరమే. కాని మానవుని ముందు కొన్ని పరిధులున్నాయి. అందువల్ల అతడు దాని వాస్తవాన్ని పరిపూర్ణంగా చూడలేడు. ఈ ఆ కారణం వల్లనే ఆమోద యోగ్యమయిన మానవ చట్టాల పరిశీలనలో అతడు విజయం సాధించలేకపోయాడు. కేవలం జ్ఞానపరమైన జీవిత చట్టాలు అన్వేషించడం Discoverableలో అజేయుడేనని సమ్మతించక తప్పలేదు.

ఈ మార్గంలో పెద్ద అవరోధం స్వయంగా మానవుని స్వభావమే. మాన వుని గురించి మన చరిత్ర చెబుతున్నదేమిటంటే అతనికి సంపూర్ణ అధికారాలు లభించినప్పుడు దౌర్జన్యం చేశాడు. భూమిపై కల్లోలాలు సృష్టించాడు. నిజంగా పని చేయాలనుకుంటే ఒక ఉన్నతమయిన అధికారి క్రింద ఉండి మాత్రమే చేయగలుగుతాడు అని.

అందువల్లనే లార్డ్ ఎడిగ్‌టన్‌కు ఇలా చెప్పవలసివచ్చింది. "Power Corrupts and Absolute Power Computs Absolutely" "అధికారం చెడుతుంది. సంపూర్ణాధికారం పూర్తిగా చెడుతుంది". అమెరికాకు చెందిన ప్రముఖ (Bilogist)జీవశాస్త్రజ్ఞుడయిన ప్రొఫెసర్ బి.ఎఫ్. స్కిన్నర్ (B.F. Skinner), ఆయన మిత్రులు ఈ సమస్యకు పరిష్కారం కేవలం జీవశాస్త్రం ఆధారంగా చూపి తమ ఫలితాలను ఒక గ్రంథ రూపంలో లిఖించారు. దాని పేరు Beyond Freedom and Dignity ఇందులో స్పష్టంగా సమ్మతించడం జరిగింది.

"We can not Appord Freedom"

మానవుడు స్వతంత్రను కాపాడుకునే యోగ్యత లేనివాడు ఆ జీవశాస్త్ర పరిశోధనలు ఖుర్ఆన్‌ను ధృవీకరిస్తున్నాయి. మానవ నిర్మిత చట్టానికి సంబంధించి కొన్ని పరిశోధనలు క్రింద పేర్కొనబడుతున్నాయి. ఇవి పైన పేర్కొన్న వాటికి సాక్ష్యంగా నిలుస్తాయి.

దివ్య ఖుర్ఆన్ వడ్డీ నిషేధించింది

ప్రపంచం వడ్డీ వాస్తవాన్ని గ్రహించలేదు పైగా ఆర్థికాభివృద్ధి జరగాలంటే వడ్డీ లేకుండా సాధ్యపడదని అంటున్నారు.

ముస్లిం దేశాలలోని ఆర్థిక వ్యవస్థ ఒక వెయ్యి సంవత్సరాల వరకు వడ్డీ రహితంగా నడిచింది. ఆ దేశాలలో ఒక వైపు ధనరాశులు ఉండగా మరోవైపు కఠిన బీదరికం ఉన్నట్లు ఎక్కడా కనిపించలేదు. ఆధునిక ఆర్థిక వ్యవస్థ వడ్డీపై నిలిచి ఉంది. దానివల్ల మానవ సమాజంలో మొదటిసారి అసమాన పరిస్థితులు జనించాయి. దానివద్ద ఆ స్థితిని మార్చడానికి ఎలాంటి పరిష్కారం లేదు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ అభివృద్ధి పథకాల కోసం అభివృద్ధి చెందిన దేశాలనుండి వడ్డీతో అప్పుతీసుకోక తప్పడంలేదు. ఎంత భారి మొత్తం

ఆదేశాలపై మోపబడిందంటే వాయిదాల చెల్లింపు కోసం మళ్ళీ అప్పుతీసుకో వలసిన పరిస్థితి నెలకొంది. ఆయా దేశాలు మొత్తం బాకీలు గనక తీర్చినట్లయితే దేశం దివాలా తీయకమానదు.

షరీఅత్ - ఖుర్‌ఆన్‌ల శిక్ష

మనిషి ఒక అధికారం గల జీవరాశి అని దివ్య ఖుర్‌ఆన్ చెబుతోంది. మనిషి తన సంకల్పంతో నేరం చేస్తాడు. నేరస్తునికి ఎలాంటి శిక్ష విధించాలంటే అది చూసి ఇతరులు గుణపాఠం నేర్చుకోగలగాలి. ప్రజలు నేర ఫలితాన్ని చూసి భయ భీతులు చెందగలగాలి. భవిష్యత్తులో నేరం చేయడానికి సాహసం చేయకుండా ఉండాలి. దివ్య ఖుర్‌ఆన్ హత్యకు ప్రతిహత్య, దొంగకు చేయి నరకాలని నిర్ణయించింది. కాని పెద్దెనిమిదవ శతాబ్దంలో ఖుర్‌ఆన్ ఆజ్ఞలకు ప్రతికూలంగా ఒక గుడ్డి సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. "ఒక వ్యక్తి కావాలని నేరం చేయడంలేదనీ, ఆవేశంతో చేస్తున్నాడనీ, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక స్థితిగతులే బాధ్యతవహించవలసి ఉంటుంది మనిషి బాధ్యుడుకాడు. అందువల్ల నేరస్తుడిని నేరస్తునిగా భావించి శిక్షించడానికి బదులు, అతనిని రోగిగా భావించి చికిత్సకోసం ఏర్పాట్లు జరగాలని." ఒక సిద్ధాంతాన్ని కనిపెట్టారు. దానికి ప్రపంచంలో మంచి ఆదరణ లభించింది. అనేక దేశాలలో జైళ్ళు నిర్మించే బదులు "సంస్కరణా సంస్థలు" నెలకొల్పబడ్డాయి. కఠిన శిక్షలు ఎత్తివేయబడ్డాయి. కాని తరువాత పరిశోధనలు వాటిని తప్పుగా నిర్ధారించాయి. ఈనాడు అభివృద్ధి చెందిన దేశాలలో జరుగుతున్న నేరాలు అభివృద్ధి చెందని దేశాలకంటె అధికంగా ఉంది. ఏ దేశంలో నైతే వేలాది పరిశోధనల నియమాలను అవలంభించడం జరిగిందో అక్కడే నేరాలు వేగాన్ని పుంజుకున్నాయి. శ్రీలంకా, డిలావేర్ లలో మరణశిక్షలను మళ్ళీ పునరుద్ధరించవలసి వచ్చింది. న్యాయనిపుణులు తమ సిద్ధాంతాలను పున: సమీక్షించుకోవలసి వచ్చింది. ఒక న్యాయ నిపుణుడు; "ఏ వ్యక్తి అయినా హత్య చేస్తే హంతకుడికి మరణ శిక్షకు అర్హునిగా చేస్తుందన్న విషయం ప్రజలలో సర్వ

సాధారణం కావాలి. అనే విషయం నేరాలను అరికట్టడంలో ధీటుగా నిలుస్తోంది" అని అన్నాడు. (Detterant Value) ఈ విధాన ప్రకారం ఏ దేశాలలోనైతే షరిఅత్తు విధించే శిక్షలు అమలు అవుతున్నాయో (అంటే సౌదీ అరేబియా) అక్కడి పెద్ద దేశాలకంటె నేరాలసంఖ్య చాలా తక్కువ.

ఈ వాస్తవాలు, అనుభవాలు "ఖుర్ఆన్ దైవగ్రంథం" అనడానికి నిదర్శనంగా కనిపించడం లేదా? పెద్దవాడు, వివేకవంతుడు, సృష్టికి, మానవ పుట్టుకకు కర్త అయినటువంటివాని గ్రంథమని మనసు సాక్ష్యం పలకడం లేదా!?